5 సం.లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

బీసీ రిజర్వేషన్స్ పెంపును కొట్టివేయడం దురదృష్టకరం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 284 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 10 అక్టోబర్ 2025

## సిజెఐ గవాయ్‌పై దాడి యత్నం కేసు

- రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసిన బార్ అసోసియేషన్
- సుప్రీంలో ఎంట్రీని నిషిస్తూ ప్రకటన విడుదల




## ముంబైలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్కు మోడీ స్వాగతం

- ఇరుదేశాల సంబంధాలు బలోపేతంపై స్టార్మర్ వ్యాఖ్యలు
- భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని కితాబు







## రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ


- వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌గా కేవీఎన్ చంద్రశేఖర్‌బాబు
- వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా మనజీర్ జిలానీ సమూన్
- ఏపీపీఎస్సీ సెక్రటరీగా పి.రవి శుభాష్

**అమరావతి, 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం 31 మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మిగతా2లో...

## రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపివేత



## స్థానిక ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

- బిసి రిజర్వేషన్ల జీవో 9పై హైకోర్టు స్టే
- నోటిఫికేషన్ పైనా స్టే విధిస్తూ ఆదేశాలు
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- రెండురోజుల పాటు హైకోర్టులో సమగ్ర వాదనలు
- నోటిఫికేషన్ ఇచ్చాక కోర్టులు జోక్యం చేసుకోరాదన్న ఎజి

**హైదరాబాద్, 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది.స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు జీఓ 9పై హైకోర్టు స్టే విధించింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై విచారణను 4 వారాలపాటు వాయిదా వేసింది. అనంతరం రెండు వారాల్లోపు అన్ని పార్టీలు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. గురువారం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండో రోజు వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ వాదనలు విన్న న్యాయస్థానం.. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించింది. అయితే, జీవో 9 విడుదల అనంతరం హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు బుధవారం పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టి నేటికి వాయిదా వేసింది. ఇవాళ మరోసారి విచారణ చేపట్టిన ధర్మసనం.. ప్రభుత్వం తరపు వాదనలు విని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ తాత్కాలికంగా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరపున సమగ్రమైన మిగతా2లో...

## స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అన్ని పరిస్థితులను ఎదుర్కొంటూ వెళుతున్నాం

- నామినేషన్లకు పూర్తి సమయం కేటాయించాలి
- న్యాయపరమైన అంశాల నివృత్తికి గాంధీభవన్‌లో కమిటీ
- పిసిసి చీఫ్ తదితరులతో సిఎం రేవంత్



**హైదరాబాద్,అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై అన్ని పరిస్థితులను ఎదుర్కొని ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీ నేతలతో నిర్వహించిన భేటీలో ఆయన మాట్లాడారు. ఇన్‌ఛార్జి మంత్రులు.. ముఖ్య నేతలతో చర్చించి అభ్యర్థులను ఖరారు చేయాలి. నామినేషన్ల ప్రక్రియకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించాలి. నామినేషన్ల దరఖాస్తు నమూనా పత్రం క్షేత్రస్థాయికి పంపాలి. రిజర్వేషన్ల దామాషా ప్రకారం అభ్యర్థులను ఖరారు చేయాలి. వారికి బీ ఫారం ఇవ్వాలి.. నో డ్యూ పత్రాలు ఇప్పించాలి. న్యాయపరమైన అంశాల నివృత్తికి గాంధీ భవన్‌లో సమన్వయ కమిటీ ఉండాలి. టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి. ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉన్నవారు కమిటీలో ఉండేలా చూడాలి. ఎంపీపీలు, మిగతా2లో...

## రాష్ట్రంలో మోగిన స్థానిక సంస్థల ఎన్నికల నగారా

- ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- మొదటి విడతలో 292 జెడ్పీటీసీ, 2963 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు




**హైదరాబాద్,అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. మొదటి విడత జెడ్పీటీసీ , ఎంపీటీసీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు రిటర్నింగ్ అధికారులు. నేటి నుంచి ఈనెల 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో రెండు విడతలుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడతలో 31 జిల్లాల్లో 58 రెవెన్యూ డివిజన్లు, 292 జెడ్పీటీసీ, 2963 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్‌లను స్వీకరించనున్నారు.నామినేషన్‌లు వేసే అభ్యర్థులు కొంత మేర డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. జెడ్పీటీసీ జనరల్ అభ్యర్థి రూ.5000, రిజర్వేషన్ అభ్యర్థి రూ.2,500 డిపాజిట్ చేయాల్సి ఉండగా.. ఎంపీటీసీ నామినేషన్ దాఖలు చేసే జనరల్ అభ్యర్థి రూ.2,500, రిజర్వేషన్ అభ్యర్థి రూ.1,250 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈనెల 23న పోలింగ్ జరుగనుండగా... నవంబర్ 11న కౌంటింగ్ జరుగనుంది. తొలి విడతలో సిద్ధిపేట జిల్లాలోని సిద్ధిపేట, హుస్నాబాద్, గజ్వేల్ డివిజన్ పరిధిలోని 15 జెడ్పీటీసీ, 125 ఎంపీటీసీ స్థానాలకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. మిగతా2లో...




## సర్కార్ నడవట్లేదు.. సర్కస్ నడుపుతున్నారు

- బస్‌ఛార్జీల పెంపుతో కుటుంబాలపై భారం
- మహిళలకు ఉచితబస్సు..మగాళ్లపై ఛార్జీల భారం
- బస్ భవన్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
- ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చిన కెటిఆర్

## 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

బిఆర్ఎస్, బిజెపిలకు చిత్తశుద్ధి లేదన్న పిసిసి చీఫ్




## 42శాతం రిజర్వేషన్ల కోసం గట్టిగా యత్నించాం

- హైకోర్టు తీర్పు పరిశీలించాక తదుపరి కార్యారణ
- బిఆర్ఎస్, బిజెపిలవి రాజకీయ విమర్శలు
- మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,09 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్న వేళ, హైకోర్టు స్టేపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హైకోర్టు తీర్పుపై స్పందించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీ అందిన తర్వాత పూర్తి మిగతా2లో...

## రాజకీయ ప్రయోజనాలకోసం పాకులాట

రేవంత్ సర్కార్ చేతకానితనం వెల్లడైంది

బిసి రిజర్వేషన్లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్,09 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా వాడుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీసీలకు న్యా యం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్‌కి ఏనాడూ లేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ చేతకాని తనం కారణంగానే.. ఈ తీర్పు వెలువడిందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. అందుకే ముందగానే ప్లాన్ 'బీ'ని సిద్ధం చేసుకుని ఇవాళ హైకోర్టులో తూతూమంత్రంగా వాదనలు వినిపించిందని కిషన్ రెడ్డి విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే.. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50? క్యాప్‌ను నిర్దేశిరచిందని గుర్తు చేశారు. ఈ విషయం తెలిసినా.. రాజ్యాంగపరమైన నిబంధనలపై కనీస అవగాహన లేకుండా రేవంత్ సర్కారు వ్యవహరించిందని పేర్కొన్నారు.

# ముంబైలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్కు మోడీ స్వాగతం

**ముంబై, 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ముంబయిలో ప్రధాని మోదీ-స్టార్మర్ భేటీ అయ్యారు. ఈ సమావేశం కోసం రాజ్‌భవన్‌కు వచ్చిన యూకే ప్రధానిని మోదీ స్వాగతించారు. దీనికి సంబంధించిన చిత్రాలను విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. రెండు దేశాల మధ్య బలమైన సంబంధాల కోసం కలసికట్టుగా అని రాసుకొచ్చారు. జులైలో భారత్-బ్రిటన్ మధ్య 'స్వేచ్ఛా వాణిజ్యఒప్పందం' (ఎఫ్‌టీఏ) కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో ఇరుదేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం అవుతుందని అప్పట్లో ఇరుదేశాలు ప్రకటించాయి. ఈ ఒప్పందం నేపథ్యంలోనే 125 మంది ప్రతినిధుల బృందంతో స్టార్మర్ భారత్‌కు వచ్చారు. 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించబోతున్న భారత్‌తో బ్రిటన్ ఒప్పందం.. పురోభివృద్ధికి లాంచ్‌పాడ్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఐరోపా సమాఖ్య(ఈయూ) నుంచి తాము వైదొలిగిన తర్వాత భారత్‌తో కుదిరిన ఒప్పందం కీలకమైంద న్నారు. బ్రిటన్ ఎగుమతి చేస్తున్న ఉత్పత్తులపై భారత్ సగటు టారిఫ్ 15శాతం నుంచి 3 శాతానికి తగ్గనుం దని యూకే ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. ద్వైపాక్షిక బంధాలను మరింత విస్తృతం చేయడంపై తాజాగా మోదీ-స్టార్మర్ చర్చలు జరుపుతున్నారు. ముంబయిలోని రాజ్‌భవన్‌లో ఇరు దేశాధినేతలు సమావేశం జరిపారు. అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్మర్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలను ప్రశంసించారు. ఈ ప్రయాణంలో తామూ భాగస్వా మిగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. 2028 నాటికి మూ డో ఆర్థికశక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాని మోదీ నాయకత్వానికి అభినందనలు. ఇక్కడికొచ్చి ఈ పరిస్థితులు చూస్తుంటే మీరు లక్ష్యాన్ని చేరుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రయాణంలో మేమూ భాగం కావాలనుకుంటున్నాం. వికసిత్ భారత్ స్ఫూర్తితో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తోందన్న నమ్మకం ఉంది' అని కీర్ స్టార్మర్ ప్రశంసించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న అక్కసుతో ఇటీవల భారత్‌పై ట్రంప్ విరుచుకుపడిన సంగతి తెలిసిందే. రష్యా, భారత్..వాటి డెడ్ ఎకానమీలను మరింత దిగజార్చు కునే అవకాశముందని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్య లకు భారత్ దీటుగా బదులిచ్చింది. తాజాగా యూకే ప్రధాని కూడా ట్రంప్ వ్యాఖ్యలను పరోక్షంగా ఉద్దేశిస్తూ కౌంటర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. భారత్-యూకే మధ్య ఖరారైన వాణిజ్య ఒప్పందం గురించి కూడా కీర్ స్టార్మర్ ప్రస్తావించారు. ఇరు దేశాల సంబంధాల్లో ఆ డీల్ ఓ చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. అంతేగాక, నాణ్యమైన ఉన్నత విద్యకు ఈ రోజుల్లో డిమాండ్ పెరుగుతోందని, అందుకే భారత్‌లో మరిన్ని బ్రిటిష్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సాంకేతికత, సృజనాత్మకత, కృత్రిమమేధలో భారత్, యూకేల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని తెలిపారు.

# స్థానిక ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

కౌంటర్‌ను దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తర్వాత.. రెండు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లకు సూచించింది. హైకోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల పక్రియపై సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై స్టే ఇచ్చింది. రిజర్వేషన్ల అంశంపై విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. నాలుగు బీసీ రిజర్వేషన్లపై రెండురోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గురువారమే స్థానిక సంస్థల ఎన్నికల కోసం నోటిఫికేషన్ విలువడింది. నోటిఫికేషన్‌పై సైతం హైకోర్టు స్టే విధించింది. దాంతో ఎన్నికల పక్రియ నిలిచిపోనున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కోసం ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల జీవో నంబర్ 9ని జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ బుట్టెంబారి మాధవరెడ్డి, సముద్రాల రమేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఆర్ కృష్ణయ్య, వీ హన్మంతరావుతో పాటు పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు. ఆయా అన్ని పిటిషన్లను సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ ప్రారంభించింది. తాజాగా రిజర్వేషన్ల అంశంపై గురువారం సైతం వాదనలు కొనసాగాయి. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడిందని కోర్టుకు చెప్పారు. కొందరు ఇది నోటిఫికేషన్ కాదంటున్నారని.. అది తప్పని ఏజీ చెప్పారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన పత్రులను ఏజీ ధర్మాసనం ఎదుట ఉంచారు. నోటిఫికేషన్ వచ్చాక న్యాయస్థానాల జోక్యం ఉండదని.. నోటిఫికేషన్ వచ్చాక జోక్యం చేయొద్దని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. అయితే, రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని పిటిషనర్లు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రెండువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లు, ప్రభుత్వానికి నాలుగు వారాలు సమయం ఇచ్చింది. మళ్లీ నాలుగు వారాల తర్వాత రిజర్వేషన్ల అంశంపై విచారణ జరుగనున్నది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండు రోజుల పాటు సుదీర్ఘ వాదనలు జరిగాయి.ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

# రాష్ట్రంలో మోగిన స్థానిక సంస్థల ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

మండల పరిషత్ కార్యాలయాల్లో జెడ్పీటీసీ నామినేషన్లను స్వీకరించ నుండగా.. ఎంపీటీసీ స్థానాలకు క్లస్టర్ స్థాయిలో నామినేషన్లు స్వీకరించనున్నారు. అలాగే సంగారెడ్డి జిల్లాలో తొలి విడతలో జహీరాబాద్, నారాయణఖేడ్ డివిజన్లలోని 12 జెడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు అధికారులు. మెదక్ జిల్లాలో మెదక్ డివిజన్ పరిధిలోని 10 జెడ్పీటీసీ, 99 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ జరుగనుంది. తెలంగాణలో మొదటి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మొదటి విడత నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారులు జారీ చేశారు. ఈ నెల 11 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. మొదటి విడతలో 292 జడ్పీటీసీ, 2,964 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గత నెల 29న రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం ఐదు దశల్లో ఎలక్షన్స్ నిర్వహించన్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- తొలివిడతలో నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9 కాగా, స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11, పరిశీలన: అక్టోబర్ 12, నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 15, ఎన్నికల తేదీ- అక్టోబర్ 23, ఓట్ల లెక్కింపు- నవంబర్ 11గా నిర్ణయించారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలి విడత ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 11 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. తొలి విడతలో 292 జడ్‌పిటిసిలు, 2964 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. తొలి రెండు దశల్లో ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసిలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరో జు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతారు. నవంబర్ 11న ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఓట్ల లెక్కింపు జరుగనుంది. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలా ల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపిటిసి, 565 జెడ్‌పిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.

# సర్కార్ నడవట్లేదు..సర్కస్ నడుపుతున్నారు

**హైదరాబాద్,09 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో సర్కారు నడపట్లేదు.. సర్కస్ నడుపుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బస్ భవన్ వద్ద నిరసనలో భాగంగా ఆయన మాట్లాడారు. ఉదయం మా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు.. తర్వాత వెళ్లవచ్చన్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ అరెస్టు చేస్తున్నారు. ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఉచిత బస్సు పథకం పెట్టి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారు. ఆ నష్టాలను భరించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు కల్పించి.. పురుషులకు రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంపై టికెట్ ధరల భారం పెరిగింది. ఆర్టీసీ బస్సు పాసుల ధరలు 25 శాతం పెంచారు. మెట్రో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీని తరిమేశారు. మెట్రో, ఆర్టీసీ లేకుండా మొత్తం ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందని కేటీఆర్ అన్నారు. అనంతరం బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి భారత రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు తదితరులు వెళ్లారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు గులాబీ నేతలను గృహనిర్బంధం చేసారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే వివేకానంద గౌడ్, శంభీర్ పూర్ రాజు, సాయిబాబా తదితరులను కూడా గృహనిర్బంధం చేశారు. ఇక మాజీ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కూడా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని చలో బస్ బవన్ కార్యక్రమానికి బయలుదేరుతున్న సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అడ్డుకొని గృహనిర్బంధం చేశారు. అంతేకాకుండా... బీఆర్ఎస్ బస్ భవన్ పిలుపు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్ భవన్ వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

# 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

**హైదరాబాద్,అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. దేశంలోనే తొలిసారి కులగణన చేసింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. బీసీల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను వాళ్లు గమనిస్తున్నారని చెప్పారు. బీసీలకు మేలు చేయడా న్ని భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు తట్టుకోలేక పోతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు హైకోర్టులో ఇంప్లీడ్ కాలేదన్నారు. ఈ పార్టీల నేతలు చరిత్రహీనులుగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో మరోమారు చర్చించి ముందుకు వెళతామని అన్నారు.

# 42శాతం రిజర్వేషన్ల కోసం గట్టిగా యత్నించాం

(మొదటి పేజీ తరువాయి)

అవగాహన చేసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. హైకోర్టు 2025 సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు జరపాలని స్పష్టంగా చెప్పింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మేము గట్టి ప్రయత్నం చేశాం. కానీ, 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ పరిమితిని 50 శాతం కట్‌ఆఫ్ చేసి చట్టం చేసింది. ఆ సమయంలో వారు ఓబీసీ రిజర్వేషన్‌పై ఎలాంటి కసరత్తు చేయలేదని భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పుడు బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు మాపై నిందలు వేస్తున్నాయి. కానీ ప్రజలు అమాయకులు కాదు, బీసీ సంఘాల నాయకులు అంతకంటే అమాయకులు కాదు. ఎంపిరికల్ డాటా లేకుండా రిజర్వేషన్ ఇవ్వలేమని కోర్టు అప్పటికే చెప్పింది. అందుకే మేము శాస్త్రీయంగా సిపెక్ సర్వే నిర్వహించాం. దానిని బిల్లు రూపంలోకి తెచ్చాం. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తపడ్డాం అని స్పష్టం చేశారు. మేము అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన బిల్లును ఆపింది ఎవరు? బీజేపీ ప్రభుత్వం కదా? వాళ్లే బీసీలకు న్యాయం అడ్డుకుంటున్నారు. బీఆర్ఎస్ 50 శాతం స్లాబ్ దాటకు ండా చట్టం చేసిందంటే అదే నిరూపణ. బీసీల నోటికాడి ముద్ద ను రెండు పార్టీలు లాక్కున్నాయని భట్టి విమర్శించారు. అందుకే మేము జీఓ 9 జారీ చేశాం. సర్వేలో పాల్గొనని పార్టీలు ఇవాళ మాపై విమర్శలు చేస్తూ తగుద నమా అంటున్నాయి. మిమ్మల్ని ప్రజలు క్షమించరు. న్యాయ స్థానాల్లో, రాజకీయంగా కూడా 42 శాతం రిజర్వేషన్ కోసం మా పోరాటం కొనసాగుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశా రు. మేము బీసీ రిజర్వేషన్ల కోసం ధర్నాలు చేసినప్పుడు బీఆర్ ఎస్, బీజేపీ పార్టీలు ఎక్కడ ఉండేవి? అప్పట్లో మాతో రాలేదు, ఇప్పుడు రండి అంటున్నారని అంటూ ఆయన ఎద్దేవా చేశారు.

# సిజెఐ గవాయ్‌పై దాడి యత్నం కేసు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ చర్యలు ప్రారంభించింది. రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతోపాటు న్యాయస్థానం ప్రాంగణంలోకి కూడా ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. తాజా ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై ఓ న్యాయవాది దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఇలాంటి అస్థిరమైన ప్రవర్తన కోర్టు అధికారికి పూర్తిగా తగదని, వృత్తిపరమైన నీతిని తీవ్రంగా ఉల్లంఘించడమేనని పేర్కొంది. సుప్రీంకోర్టు గౌరవాన్ని కూడా కాలరాయడమేనని తెలిపింది. న్యాయవాది రాకేశ్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై.. పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. కాగా.. ఘటన నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే రాకేశ్ కిశోర్ లాయర్ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఓ కేసు విచారణ సమయంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై లాయర్ కిశోర్ తన కాలి బూటుతో దాడికి యత్నించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై దాన్ని అడ్డుకొని ఆయన్ను బయటకు తరలించారు. ఈ క్రమంలో ఆయన 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీజేఐ స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవన్నారు. ఈ ఘటనను ప్రధాని మోదీతో సహా పలు రాజకీయ పార్టీల అగ్రనేతలు, న్యాయవాదుల సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.

# రాష్ట్రంలో భారీగా ఐఎఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఆదేశాలు జారీ చేశారు. వీరిలో వివిధ సంస్థల డైరెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు బదిలీ అయిన వారిలో ఉన్నారు. వైద్యారోగ్య,కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా కేవీఎన్ చంద్రశేఖర్‌బాబు ,వ్యవసాయశాఖ డైరెక్టర్: మనజీర్ జిలానీ సమూన్, ఏపీపీఎస్‌సీ సెక్రటరీ: పి.రవి శుభాష్, ఏపీఎస్‌పీడీసీఎస్ ఛైర్మన్ అండ్ ఎండీ: శివశంకర్ లోతేటి, ఏపీ పౌరసరఫరాల కార్పొరేషన్ వైస్ ఛైర్మన్, ఎండీ:ఎస్.ఢిల్లీరావు, ఇంటర్ విద్య డైరెక్టర్: పి.రంజిత్ బాషా, ఏపీ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ: పి.అరుణ్‌బాబు, అడిషనల్ సీసీఎల్ఏ అండ్ సెక్రటరీ: జేవీ మురళి, అడిషనల్ సీసీఎల్ఏ అండ్ జాయింట్ సెక్రటరీగా టీఎస్ చేతన్, ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్,ఎండీ:బి.నవ్యఏపి ఎయిర్ పోర్టు డెవలెప్మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ ఎండి: సివి ప్రవీణ్ ఆదిత్య,ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్, ఎక్స్ అఫీషియో డిప్యూటీ సెక్రటరీ జనరల్ అడ్మినిస్ట్రేషన్: కె ఎస్ విశ్వనాథ్,సివిల్ సప్లైస్ అండ్ ఎక్స్ అఫిషియో డిప్యూటీ సెక్రటరీ (వినియోగదారుల వ్యవహారాలు) : ఆర్ గోవిందరావు, ఏపి స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ సెక్రటరీ: ఎస్ చిన్న రాముడు, ఏపి ట్రాన్స్ కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్: జి సూర్యసాయి ప్రవీణ్ చంద్, బాపట్ల జాయింట్ కలెక్టర్,అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్: భావనా, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ: సి విష్ణు చేతన్,వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ: ఎస్ఎస్ సోబికా,ఏపీ మేరిటైమ్ బోర్డు, సీఈవో, ఏపీ మ్యారిటైం బోర్డు ఇన్‌ఫ్రాస్టెక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్తి అదనపు బాధ్యతలు: అభిషేక్ కుమార్,ర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్: నూరుల్ కోమర్,రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ : రాహూల్ మీనా,కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్టేట్: అపూర్వ భరత్ శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్,అడిషనల్ డిస్ట్రిట్ మెజిస్ట్రేట్ : మంత్రి మౌర్య భరద్వాజ్, హౌసింగ్ డిపార్టుమెంట్ డిప్యూటీ సెక్రటరీ : సహదిత్ వెంటక్ త్రివినాగ్,ఏపీ డైయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, ఏపీ అమూల్ ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్: మురళీధర్ కొమ్మిశెట్టి (ఐఆర్ఎస్ అధికారి),ఏపీ లెథర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ వీసీ ఎండీ: ప్రసన్న వెంకటేష్.,యువజన సర్వీసులు,ఎండి ఏపి సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంఎ÷-లాయిమెంట్ ప్రమోషన్ కమిషనర్ భరణి (ఐఎఫ్ఎస్ అధికారి), అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్: తిరుమణి శ్రీపూజిత నియమితులయ్యారు.

# స్థానిక సంస్థల ఎన్నికల పక్రియ అన్ని పరిస్థితులను ఎదుర్కొంటూ వెళుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

జడ్పీ ఛైర్మన్ పదవుల ఎంపికను పీసీసీ నిర్ణయిస్తుంది. పీసీసీ నిర్ణయించే వరకు రాజకీయ ప్రకటనలు చేయవద్దు. హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసుపై పీసీసీ చీఫ్ పర్యవేక్షించాలి. ఉన్నత న్యాయస్థానం తీర్పు తర్వాత తదుపరి కార్యాచరణపై రాత్రి మరో భేటీ నిర్వహిస్తాం. తొలివిడత కోసం రాత్రికి అభ్యర్థుల జాబితా సిద్ధం కావాలని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఎన్నికల పక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని పరిస్థితులను ఎదుర్కొని ముందుకెళు తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ నేతలతో పీసీసీ ఛీఫ్ మహేష్ గౌడ్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. స్థానిక ఎన్నికలు, నామినేషన్ పక్రియపై పార్టీ నేతలకు దిశానిర్దేశర చేసిన పీసీసీ ఛీఫ్.ముఖ్యమంత్రి పాల్గొని నేతలను ఉద్దేశించి మాట్లాడారు. నేటి నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత నామినేషన్ల పక్రియ ప్రారంభమైందన్నారు. వివిధ జిల్లాలకు సంబంధించిన ఇంచార్జి మంత్రులు ముఖ్య నాయకులతో సమావేశమై రిజర్వేషన్ల దామాషా ప్రకారం అభ్యర్థులను ౖ÷నైల్ చేయాలని సూచించారు.పూర్తిస్థాయిలో సమయం కేటాయించి నామినేషన్ల పక్రియకు సమయం కేటాయించాలన్నారు. పీసీసీ లీగల్ టీమ్ నుంచి నామినేషన్ అప్లికేషన్‌కు సంబంధించి మోడల్ ఫార్మాట్ క్షేత్రస్థాయికి పంపించాలని సూచించారు. గాంధీ భవన్‌లో లీగల్ అంశాలను నివృత్తి చేసేందుకు కో- ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచాలని నేతలకు తెలిపారు. ఎన్నికల పక్రియపై అవగాహన ఉన్నవారు కమిటీలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీపీలు, జెడ్పీ ఛైర్మన్ పదవుల ఎంపికపై పీసీసీ చర్చించి నిర్ణయం తీసుకుంటుందని.. అప్పటివరకు వాటిపై రాజకీయంగా ఎలాంటి ప్రకటనలు చేయొద్దని సీఎం ఆదేశించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో జరిగే వాదనలు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని సూచించారు. హైకోర్టులో బీసీ రిజర్వేషన్ కేసుపై పీసీసీ అధ్యక్షుడు పర్యవేక్షణ చేయాలని సీఎం తెలిపారు. కోర్ట్ తీర్పు తరవాత తదుపరి కార్యాచరణ కోసం రాత్రికి మరో సమావేశం ఉంటుందన్నారు. తొలివిడత కోసం రాత్రికి అభ్యర్థుల జాబితా సిద్ధం కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

## ● స్థానిక సంస్థల ఎన్నికల పక్రియను నిలిపివేత

**హైదరాబాద్,అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల పక్రియను నిలిపేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ 29న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. హై కోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్నికల పక్రియ ఆపేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.రాష్ట్రవ్యాప్తంగా జరుగనున్న ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలపై జారీ చేసిన గెజిట్‌ను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు మేరకు సెప్టెంబర్ 29న విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. హైకోర్టు ఆదేశాలు అందిన వెంటనే ఎన్నికల పక్రియను నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ గెజిట్ విడుదల చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి వచ్చిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కూడా తాత్కాలికంగా రద్దు అయ్యింది. ఎన్నికల పక్రియను కొనసాగించాలా లేదా అన్నదానిపై హైకోర్టు తుది ఆదేశాల తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వేళ ఊపందుకున్న రాజకీయ వాతావరణం కొంత శాంతించింది.

# స.హ చట్టం అవినితి పరుల గుండెల్లో మరఫిరంగు

**• చుంచు రాజేందర్**

**డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు**




**హన్మకొండ,అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమాచార హక్కుచట్టం అవినితి పరుల గుండేల్లో మరఫిరంగని స.హ చట్టం అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోని, ఆక్రమ అవినితిని నిర్మూలించాలని దళిత బహుజన ఫ్రంట్ డి బి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, పిలుపునిచ్చారు. గురువారం నాడు హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రములో డి బి ఎఫ్ ఆద్వర్యంలో సమాచార హక్కు చట్టం 20 ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా పరిరక్షణ వారోత్సవాల ప్రచారోద్యమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, 2005, ఆర్ టి ఐ అనేది ప్రభుత్వ రంగ సంస్థల నుండి సమాచారం పొందడానికి పౌరులకు అధికారాన్నిచ్చే చట్టమే ఈ ఆర్ టి ఐ చట్టం.చట్టం వచ్చి 20 సంవత్సరాలు పూర్తవుతున్నందున ఈ నెల 5 నుండి 12 వరకు జరుగుతున్న వారోత్సవాలలో బాగంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మేదావులు పాల్గోని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ కార్య కలాపాలలో పారదర్శకత, జవాబు దారీతనాన్ని ప్రోత్సహిస్తూ అవినీతిని అరికట్టడానికి సమాచార హక్కు చట్టం సహాయ పడుతుందన్నారు. ఈ చట్టం ప్రకారం, భారతీయ పౌరులు ప్రభుత్వ సంస్థల వద్ద ఉన్న సమాచారాన్ని, రికార్డులను కోరవచ్చు. ఈ చట్టం వినియోగదారులకు సాధికారతను కల్పించి, ప్రజాస్వామ్య పాలనను బలోపేతం చేస్తుందన్నారు. సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ) ప్రకారం, ప్రతి భారత పౌరుడు ప్రభుత్వ సంస్థల నుండి సమాచారాన్ని పొందే హక్కును కలిగి ఉంటాడన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వాల పని తీరులో బహిరంగత, జవాబు దారీతనం పెరుగుతూ సమాచారం సులభంగా అందుబాటులో ఉండటం వల్ల అవినీతిని అరికట్టడానికి ఈ చట్టం ఒక ముఖ్య సాధనమన్నారు. పౌరులు లిఖిత పూర్వకంగా సమాచారాన్ని కోరుతూ అభ్యర్థన చేయాలన్నారు. సాధారణంగా సమాచారాన్ని 30 రోజుల లోపు అందించాలి, కొన్ని అత్యవసర సందర్భాలలో 48 గంటల లోపు అందించాలన్నారు .కేంద్రంలో సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (సిఐసి), రాష్ట్రాలలో రాష్ట్ర సమాచార కమిషన్లు ఈ చట్టాన్ని అమలు చేస్తాయన్నా రు. సమాచార హక్కు చట్టాన్ని నిరుగార్చటానికి మరొక చట్టాన్ని తిసుకొచ్చి ప్రజల దగ్గర కు వస్తున్న సమాచారాన్ని దూరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతుందన్నారు. ఈ కుట్రలకు వ్యతిరేకంగా పౌర సమాజం స్పందించి తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, ప్రజా సంఘాల జెఎసి జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, నాయకులు సదానందం, స్వామీ,అయిలయ్య, బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# బీసీ రిజర్వేషన్స్ పెంపును కొట్టివేయడం దురదృష్టకరం

**బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బీసీ రిజర్వేషన్స్ పెంపుదల జీవోను హైకోర్టు కొట్టివేయడం తీవ్ర విచారకరం, దురదృష్టకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. చట్టసభలతో పాటుగా విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్స్ అమలు జరగాలంటే పార్లమెంటులో చట్టంచేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ నందు పొందుపర్చిన తర్వాతే సాధ్యపడుతుందని బీఆర్ఎస్ మొదటి నుంచి కూడా చెబుతున్నదన్నారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టిన సందర్భాలలో మద్దతివ్వడం జరిగిందన్నారు. ఎంపీ రవిచంద్ర మాజీ మంత్రులు గంగుల కమలాకర్, వీ.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ తదితర ప్రముఖులతో కలిసి గురువారం సాయంత్రం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన "ఆపరేషన్ సక్సెస్, పేషంట్ డెడ్" అనే చందంగా కాంగ్రెస్ వ్యవహారం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో ఎలాగైనా బీసీల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి రావాలనే కుట్ర, కాంక్షతోనే కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసమే బీసీ అస్త్రాన్ని ప్రయోగించి ఉపయోగించు కున్నదని చెప్పారు. అమలు కాదని తెలిసి కూడా మోసపూరిత జీఓ తీసుకొచ్చి బీసీలను దగా చేశారని, ఆగం చేస్తున్నారని,బీసీల ఆగ్రహ జ్వాలలో కాంగ్రెస్ కూలిపోవడం ఖాయమని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. కులగణన సందర్భంగా జనాభాను 25లక్షలు తక్కువ చేసి చూపి బీసీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం చంపేసిందని ఎంపీ వద్దిరాజు ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలకు మంచి జరగాలనే ఉద్దేశం, చిత్తశుద్ధి కాంగ్రెస్, బీజేపీలకు ఉన్నట్టయితే పార్లమెంటులో చట్టంచేసి 9వ షెడ్యూల్ లో చేర్చడం రిజర్వేషన్స్ పెంపుదల సాధ్యమవుతుందని ఎంపీ రవిచంద్ర వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ కూర్పుతో పాటు జరుగుతున్న అన్యాయాల ను బీసీలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని, తగిన రీతిలో బుద్ధి చెబుతారని ఎంపీ రవిచంద్ర హెచ్చరించారు. ఢిల్లీలో చేయాల్సింది ఇక్కడ చేసి మసిబూసి మారేడు కాయ చేయడం తగదన్నారు. పార్లమెంట్ సమావేశాలలో "ఓట్ చోర్"పై నెల రోజుల పాటు విలువైన సమయాన్ని వృధా చేశారని, కనీస ప్రస్తావన కూడా తేలేదని, వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టలేదని, కాంగ్రెస్ బీసీల వ్యతిరేక వైఖరిని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి 100మంది, అది నాయకత్వం వహిస్తున్న ఇండియా కూటమికి 300 మందికిపైగా ఎంపీలు ఉన్నారని, రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని తీసుకుపోయి ప్రధాని నరేంద్రమోడీపై వత్తిడి పెంచడం ద్వారా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడితే బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని, సునాయాసంగా పాస్ అవుతదని వివరించారు.బీసీ బిడ్డలంతా ఏకతాటిపైకి వస్తున్నారని, తమకు జరుగుతున్న అన్యాయాలపై తిరుగుబాటు తప్పదని ఎంపీ వద్దిరాజు చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శుభప్రద పటేల్, కురవ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ మృతి బాధాకరం : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర** ఏస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ మృతి పట్ల రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులకు ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కష్ట సమయంలో శ్రీనివాస్,ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాల్సిందిగా ఎంపీ వద్దిరాజు భగవంతున్ని ప్రార్థించారు.

---

# 46వ డివిజన్లో విజయవంతంగా సంతకాల సేకరణ






**- ముఖ్య అతిథులుగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్**

**- సంతకాల సేకరణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు**

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం, టిపిసిసి సూచన మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం పట్టణంలో 46 వ డివిజన్ లో ఆ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షనే ధ్యేయంగా రాహుల్ గాంధీ అహర్నిశలు శ్రమిస్తున్నారని అందులో భాగంగా 'ఓట్ చోర్ గద్దె చోడ్' ఉద్యమానికి పిలుపు ఇవ్వడం జరిగింది అని అన్నారు. బీహార్ ఎన్నికల జాబితాలో జరిగిన అవకతవకలను ప్రజలకు వివరిస్తూ డివిజన్ నుండి 100 సంతకాలకు తగ్గకుండా సేకరించడం జరిగిందని తెలియజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే మిగిలి ఉన్న అన్ని డివిజన్ లలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

---

# 5 సం.లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి

**• జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య**




**హన్మకొండ,అక్టోబర్ 09 (పి.సి.డబ్ల్యూ.న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సూచనలకు అనుగుణంగా ఈ నెల 12 ఆదివారం రోజు అప్పుడే పుట్టిన పాప నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు తల్లి దండ్రుల బాధ్యత తీసుకొని పల్స్ పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించి.. పోలియో నిర్మూలనకు సహకరించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారతదేశం లో గత 14 సంవత్సరంల నుండి పోలియో కేసు నమోదు కానప్పటికీ రాష్ట్రంలోని పట్టణ జనాభా అధికంగా ఉన్న హనుమకొండ జిల్లాతో పాటు మొత్తం ఐదు జిల్లాలలో ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని 12న జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల వయసు గల (84301) పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు (472) బూతులు (17) బస్టాండ్లు, రైల్వే స్టేషన్ లాంటిట్రాన్సిట్ పాయింట్లు మొబైల్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇమునైజేషన్ అధికారి డాక్టర్ ఏ మహేందర్ ఈ కార్యక్రమాన్ని పర్య వేక్షిస్తున్నారని జిల్లాకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తయారు చేశారని ఆయన అన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గురువారం జూమ్ ద్వారా వైద్యాధికారులు, సూపర్వైజర్స్ తో డీఎంహెచో, డీఐఓ సమావేశం నిర్వహించారు.

---

# కరీంనగర్లో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్పై ఎఫ్ఐఆర్ నమోదు...




**కరీంనగర్,అక్టోబర్09(పీసీడబ్ల్యూ న్యూస్):** బిజెపి పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మహమ్మద్ ప్రవక్త పైన అనుచిత వాక్యాలు చేసినందున గురువారం రోజు కరీంనగర్ వన్ టౌన్ లో మర్కజి మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు హాఫెజ్ యూసుఫ్, కరీముల్లా షా దర్గా ముతవల్లి మన్సూర్ తవక్కలి,వన్ టౌన్ పోలీసు థానాలో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని వినతిపత్రం సమర్పించడం జరిగినది. వారు మాట్లాడుతూ రాజాసింగ్ గతంలో కూడా మహమ్మద్ ప్రవక్త పైన ఇలాంటి అనుచిత వాక్యాలు చేయడం జరిగినది. ఒక మతానికి టార్గెట్ చేస్తూ మాట్లాడడం సిగ్గుచేటు బిజెపి పార్టీ నుండి రాజాసింగ్ ను బహిష్కరించాలని కోరుతూ, మన్సూర్ తవక్కలి అగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికు కాంగ్రెస్ ఒక సెక్యులర్ పార్టీ అయినందున రాజాసింగ్ ను త్వరగా జైలు పంపించాలని వారు కోరినాడు. ఈ కార్యక్రమంలో అహ్మద్, సయ్యద్ ఆదిల్, అబిద్, ఇమాద్, జమీల్, మతీన్, అబిద్,పాల్గొన్నారు.

---

# నిర్దిష్ట గడువు లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**• ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణ అభివృద్ధి పనులపై మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేస్తున్న పనులను ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నాణ్యత ను పర్యవేక్షించాలని, పనులలో లోపం కనిపిస్తే ఉపేక్షించబోమని తెలిపారు. ప్రకాశ్ నగర్, గాంధీనగర్, ద్వారకనగర్, చర్చి కాంపౌండ్ రోడ్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో పూర్తికాగా, ఎన్ఎస్పీ క్యాంపు, కొత్త బస్టాండ్, తెలంగాణ తల్లికూడలి ప్రాంతాల్లో కొనసాగుతున్న పనుల ఫోటోలను కలెక్టర్ పరిశీలించారు. ఖమ్మం నగరం అందంగా ఉంటేనే జిల్లా అభివృద్ధి కనబడుతుందని అన్నారు. సెంటర్ డివైడర్లు, సర్కిల్ లకు రంగులు వేయాలని, ప్రమాదాల సూచికలు పెట్టాలని అన్నారు. నూతన టెక్నాలజీ తో నగరంలో గుంతలు పూడిచివేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష లో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు రంజిత్, కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్తునూర్ అంగన్వాడీలు ఘనంగా పోషణ మాసం



**వెల్గటూర్ ప్రతినిది,అక్టోబర్ 09 (పి.సి.డబ్ల్యూ.న్యూస్):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ముత్తునూరు గ్రామంలో అంగన్వాడి సూపర్వైజర్ మాదాడి ఆండాలు ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సూపర్వైజర్ ఆండాలు మాట్లాడుతూ సెప్టెంబర్ 16వ తేదీ నుండి ప్రతి అంగన్వాడి కేంద్రాలలో పోషణ్ మాసం సందర్భంగా తల్లులకు,బాలింతలకు గర్భిణులకు తీసుకోవలసిన జాగ్రత్తలు పిల్లల పెరుగుదలకు ఏ ఆహారం తీసుకోవాలి అనే విషయాలపై అవగాహన కలిగిస్తున్నా మని ఆమె అన్నారు. ముత్తునూర్ అంగన్వాడీలు జక్కాపురం రుక్మిణి సంఘ ప్రేమలత, ముక్కట్రావ్ పేట బుద్ధెజయ, రాంనూర్ గంద్ర ఉమాదేవి, గ్రామ కార్యదర్శి సందన వేణి అంజిత్ కుమార్, ఆయాలు కుషన్ పెల్లి లక్ష్మి బోనాల సర్వజన, అసలు గవ్వల యమునా, తల్లులు అనుమాల రమ్య, చింతలత, సంఘ అమృతమ్మ, మేడి లచ్చమ్మ, చిప్పరి సుప్రజ, కుషన్ పెల్లి లావణ్య, గొల్ల దైవ కృప, సంఘ వెంకటేష్, పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న చరవాణి అప్పగింత: ఎస్సై వంశీ క్రిష్ణ



**గంగాధర అక్టోబర్ 9 (పీసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని వివరాలలోకి వెళితే హైదరాబాద్ కి చెందిన నరాల నాగేంద్ర రెండు నెలల క్రితం గంగాధర మండల కేంద్రంలో తన సాంసంగ్ మొబైల్ పోగొట్టుకుని పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయగా అట్టి ఫోన్ యొక్క వివరాలను IMEI నంబర్లను CEIR పోర్టల్లో నమోదు చేసి ఫోను ట్రేస్ చేసి ఈరోజు బాధితునికి అప్పగించడం జరిగింది.ఎస్ఐ గారు మాట్లాడుతూ ఎవరైనా తమ ఫోన్ ను పోగొట్టుకున్నట్లయితే వెంటనే CEIR పోర్టల్ లో ఫోన్ యొక్క IMEI నంబర్లను, వివరాలను నమోదు నమోదు చేయాలని బాధితులకు సూచించడం జరిగింది.

# పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు



**ములుగు అక్టోబర్ 9 (పీసిడబ్ల్యూ న్యూస్):**పొక్సో కేసులో ఒకరికి జీవిత కైదు విధించినట్లు ములుగు ఎస్పీ శబరీశ్ గురువారం ప్రకటనలో తెలిపారు.ఎస్పీ తెలిపిన వివరాలు.. ఏటూరు నాగా రానికి చెందిన నిందితుడు మంతెన రామయ్యపై నమోదు చేసిన పొక్సో కేసు నేరం నిరూపితమైంది. కోర్టు జీవిత ఖైదు, 20 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ.12 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ. 10 లక్షల నష్టపరిహారం అందించాలని కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

# తక్షణమే వేతనాలు చెల్లించాలి'

**ములుగు అక్టోబర్ 9 (పీసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జాకారం, ఏటూరునాగారం బాలుర, ములుగు బాలికల భోధన సిబ్బంది, పార్ట్ టైం టీచర్స్ గత 3 నెలలుగా వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాము రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా బోధన, బోధనేతర విధులను తక్కువ వేతనంతో నిర్వహిస్తున్నామని వాపోయారు. మూడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని ములుగు డీసీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు.



# విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

● కొడుకు మృతి తండ్రికి తప్పిన ముప్పు






**జగిత్యాల జిల్లా , అక్టోబర్ 09 (పి.సి.డబ్ల్యూ.న్యూస్):**జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామయంలో ఓ రైతు అడవి పందుల బారి నుంచి పంట రక్షణ కోసం వేసిన విద్యుత్ కంచె చివరికి పక్క పొలం రైతు ప్రాణాలనే బలి తీసుకున్న విషాద కర సంఘటన ఇది. పంట రక్షణ కోసం పక్క రైతు వేసిన విద్యుత్ కంచెను గమనించక బింగి సతీష్(35) అనే యువరైతు విద్యుత్ షాక్ కు గురయి పంట చేను వద్దనే గురువారం ఉదయం మృతి చెందారు. అతడి వెనకాలే వస్తున్న తండ్రి చిన్నయ్య త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించు కొన్నారు. ఘటనా స్థలానికీ విచ్చేసిన పెద్దపల్లి సి.ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం గ్రామానికీ చెందిన కోట కనుకయ్య తాను కౌలుకు చేస్తున్న పది ఎకరాల పొలం చుట్టూ అక్రమంగా విద్యుత్ కంచెను పెట్టారు. అతడి పొలం పక్కనే కౌలుకు తీసుకొని బింగి చిన్నయ్య, సతీష్ అనే తండ్రి కొడుకులు పంటను సాగు చేశారు. రాత్రి విద్యుత్ కంచెకు విద్యుత్ సరఫరా అయ్యేలా కనెక్షన్ ఇచ్చి ఉదయం తీయాల్సిన కనెక్షన్ ను కనకయ్య మరిచిపోయారు. ఇదే క్రమంలో తండ్రి కొడుకులు చిన్నయ్య సతీష్ పత్తి చేనుకు క్రిమి సంహారక మందు స్ప్రే చేయ డానికి పొలం వద్దకు వెళ్లారు. వీరి పొలానికి చేరాలంటే కనుకయ్య పొలం దాటి వెళ్లాల్సి ఉంటుంది.పొలం గట్టు పై నడుస్తుండగా ప్రమాదవ శాత్తూ కంచెకు తగిలి విద్యుత్ షాక్ కు గురయి సతీష్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య బిడ్డ ఉన్నారు. ఖిలా వనపర్తి ముంజంపల్లి దొంగతుర్తి సబ్ స్టేషన్ పరిధిలో తరుచుగా విద్యుత్ షాక్ కు గురయి రైతులు మృత్యు వాత పడుతున్నారు. పంట రక్షణ కోసం సోలార్ విద్యుత్ కంచెను రైతులు ఏర్పాటు చేసుకోవాలి.అక్రమ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకొని ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోతున్నారు.రెండునెలల కాలంలోనే పలువురు రైతులు మృతి చెందారు .విద్యుత్ శాఖ అధికారులు సైతం ఇల్లీగల్ విద్యుత్ కంచెల పై దృష్టి సారించాలని సూచించారు. పంట రక్షణ కోసం అక్రమ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం నేరమని సిఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవటం పట్ల గ్రామాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నత స్థాయి ట్రాన్స్ కో అధికారులు దీని పై విచారణ సాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఓటు చోరీపై పలు డివిజన్లలో సంతకాల సేకరణ...

-హాజరై మాట్లాడిన సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి







**కరీంనగర్,అక్టోబర్09(పీసీడబ్ల్యూ న్యూస్):**ఓటు చోరీ పై పలు డివిజన్లలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమం లో పాల్గొన్న సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ దేశ వ్యాప్తంగా చేస్తున్న ఓటు చోరీని అరికట్టడానికి రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమంలో భాగంగా అన్ని ప్రాంతాలలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని ప్రజలు దీంట్లో భాగస్వామ్యం అవుతున్నారని నరేందర్ రెడ్డి అన్నారు.నగరంలోని అన్ని డివిజన్లలో జరుగుతుందని అనుకున్న దానికంటే ఎక్కువ ప్రజల నుంచి స్పందన వస్తుందని నరేందర్ రెడ్డి అన్నారు.మల్కాపూర్ 16 డివిజన్ లో స్థానిక నాయకుడు బొమ్మ ఈశ్వర్ గౌడ్ మరియు డివిజన్ అధ్యక్షుడు కాశీపాక శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మడుపు మోహన్,శ్రవణ్ నాయక్, పండుగ సాయి, కొక్కు సందీప్, గొర్రె పోచమల్లు, బొమ్మ సత్యనారాయణ, తొర్తి శ్రీనివాస్, కాసారపు ఎల్లాగౌడ్, తొర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.20 వ ఇందిరమ్మ కాలనీ లో ఆస్తాపురం రమేష్ మరియు లత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆస్తా పురం తిరుమల, పర్వతం మల్లేశం,గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఖమ్మంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి పర్యటన



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 9:30 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియంలో బాలసాని సన్యాసయ్య మెమోరియల్ తెలంగాణ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ తొలి టోర్నమెంట్ ప్రారంభోత్సవ వేడుకకు ఆయన హాజరుకానున్నారు.

# విస్తృతంగా ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలు చేసి ప్రారంభించిన సుడా చైర్మన్...

● చివరి లబ్ధి దారుడి వరకు ఇందిరమ్మ ఇండ్లిస్తాం

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి







**కరీంనగర్,అక్టోబర్09(పీసీడబ్ల్యూ న్యూస్):** రేకుర్తి బుడిగె జంగాల కాలనీలో పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్దారుల ఇండ్లకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇల్లిస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఉన్న చివరి లబ్ధిదారుని వరకు ఇండ్లు మంజూరు చేస్తుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.కరీంనగర్ నియోజకవర్గంలో ఆలస్యమైనందున అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ఇంకా పూర్తి కాలేదని మిగిలిన అర్హులకు ఇండ్లు మంజూరు చేస్తామని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.భూమి పూజ చేసుకున్న లబ్ధిదారులు తూర్పులా పోచవ్వ,పర్వతం స్వప్న,కల్లెం అంజవ్వ, చింతల లక్ష్మి.ఈ కార్యక్రమంలో అస్తపురం రమేష్, పర్వతం మల్లేశం,అస్తపురం తిరుమల,మ్యాక శ్రీనివాస్,దుబ్బుల రాజయ్య, లింగంపల్లి లచ్చాయ్యా తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు జడ్జిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య




**చిట్యాల అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయి పై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ అంబేద్కర్ సెంటర్లో విగ్రహం ముందు నిరసన కార్యక్రమము చేపట్టడం జరిగింది . ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య హాజరై మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలం ఏకమై అంబేద్కర్ చూపిన మార్గంలో కులరకసిని అంతమొందించుటకై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లాయరు రాకేష్ కిషోర్ సీనియర్ కౌన్సిలర్ అయి ఉండి అన్నీ తెలిసినా కానీ జడ్జి పైచెప్పు విసరడం సిగ్గుచేటు అన్నారు దీనిని అంబేద్కర్ యువజన సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామాన్నారు . ఆ లాయర్ రాకేష్ కిషోర్ ను కోర్టు నుండి శాశ్వతంగా బహిష్కరించాలని మరియు క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం మండల సాంస్కృతిక కార్యదర్శి దాసారపు నరేష్ నాయకులు అంబేద్కర్ వాదులు గడ్డం సదానందం బంజర్ల రవీందర్ ధర్మ సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రమేష్ నేరెళ్ల చేరాలు గిన్నారపు కుమార్ పాల్గొన్నారుద

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడిన దుకాణాలపై కొరడా

● పలు దుకాణాలకు జరిమానా విధించిన మున్సిపల్ అధికారులు



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని కస్బా బజార్, కమాన్ బజార్, అజీజ్ గల్లి ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై గురువారం మున్సిపల్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడిన వివిధ దుకాణాలపై జరిమానాలు విధించగా, మొత్తం 81,500 రూపాయలు జరిమానా విధించడం జరిగింది. అదేవిధంగా సుమారు 70 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకుని, పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను వాడాలని మున్సిపల్ అధికారులు కోరారు.



## ఆపరేషన్ సక్సెస్ పేషంట్ డెడ్ అనే నానుడే రేవంత్ రెడ్డి ఫార్ములా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన సిద్ధంగా ఉండాలని సంగారెడ్డి బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బి ఆర్ ఎస్ నేతలు ఎమ్మెల్యే ను కలసి తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానా ల్లో పార్టీ పరంగా బలమైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడంతో పాటు జెడ్పీలను సైతం కైవసం చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థలు నిర్వహించడంలో ఆపరేషన్ సక్సెస్ పేషంట్ డెడ్ రేవంత్ ఫార్ములా ఇదే అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో లో కంది మండల బి ఆర్ ఎస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ ఐఏఎస్ అధికారి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ...





**రేగొండ, అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈరోజు ఐ ఏ ఎస్ సెంట్రల్ అధికారి శ్రీమతి పౌసమి బసు సందర్శించి .గర్భిణీ స్త్రీలు ఆరోగ్య కేంద్రంలో డెలివరీ అయ్యేవిధంగా చూడాలని ఆదేశించారు. పిల్లలకు పోలియో టీకాలు. క్షయ వ్యాధి కుష్టి వ్యాధి గ్రస్తులకు ప్రతి నెల మందులు ఇచ్చే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. వారి వెంట జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా వైద్యాధికారి అడిషనల్ కలెక్టర్ డాక్టర్ హిమబిందు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రేపు డయల్ యువర్ డిఎం



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సూచనలు తెలుసుకొనుట కొరకు అక్టోబర్ 10, 2025 శుక్రవారం నాడు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం సాయంత్రం 3.00 గంటల నుండి 4.00 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రయాణికులు 9959225958 నంబర్ కు ఫోన్ చేసి సమస్యలను/సూచనలను తెలియజేయ వలసినదిగా కోరారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు

- ఎమ్మెల్యే మాణిక్ రావు,డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయమని జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు,డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ అన్నారు. గురువారం ఉదయం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ కోహీర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని, బిఆర్ఎస్ పార్టీ నుండి ఎవరైతే పోటీ చేస్తారో వారికి ప్రతి కార్యకర్త అండగా నిలిచి గెలుపు కోసం కృషి చేయాలనీ ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను గెలిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు,పాక్స్ చైర్మన్ స్రవంతి అరవింద్ రెడ్డి, సీనియర్ నాయకులు కలీమ్, ఉద్యమకారుడు మున్నీర్ ఉద్దీన్, మాజి సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు రవికిరణ్ , బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే జిఎంఆర్

- విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థి దశ నుండి క్రీడల పట్ల ప్రోత్సాహం అందిస్తే అద్భుతమైన విజయాలు సాధిస్తారని ఇందుకు బీరంగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులే ఉదాహరణ అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.ఇటీవల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఉషూ (కిక్ బాక్సింగ్) రాష్ట్ర స్థాయి పోటీల్లోసంగారెడ్డి జిల్లా పటాన్చెరువు నియోజకవర్గం బీరంగూడ మున్సిపల్ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం.అశ్విని అండర్ 17 విభాగంలో బంగారు పతకం సాధించింది. త్వరలో కాశ్మీర్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.ఇదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రుత్విక రెడ్డి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా స్థాయి షటిల్ బ్యాట్మెంటన్ పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. రాబోయే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో మెరుగైన ప్రదర్శనతో జాతీయ స్థాయిలో పటాన్చెరు పేరును నిలబెట్టాలని కోరారు. క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులను క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించేలా సంపూర్ణ సహకారం అందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, ఫిజికల్ డైరెక్టర్ అమూల్యను ఎమ్మెల్యే జిఎంఆర్ అభినందించారు.

## ఆర్టీసీ చార్జీల పెంపు అన్యాయం: బీఆర్ఎస్ పార్టీ

- చలో బస్ భవన్ కార్యక్రమంలో పాల్గొన్న మాదిరి ప్రిథ్వీరాజ్
- ప్రజలతో కలిసి బస్ ప్రయాణం చేసిన ప్రిథ్వీరాజ్ - ప్రజా సమస్యల పట్ల స్పందన





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో "చలో బస్ భవన్" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుతో కలిసి మాదిరి ప్రిథ్వీరాజ్ మెహిదీపట్నం నుండి బస్ భవన్ వరకు బస్‌లో ప్రయాణించి,సాధారణ ప్రయాణికులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు.ప్రయాణికుల సమస్యలను వివరంగా విన్న అనంతరం, అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ,పేద మధ్యతరగతి ప్రజల తరపున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి హరీష్ రావు,బీఆర్ఎస్ శాసనసభ్యులు, నాయకులు కలిసి టీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హైకోర్టులో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన కీలక విచారణలు జరిగాయి.

- ఈ కేసుల్లో ఐలాపూర్ మాణిక్ యాదవ్ ఇంప్లిడ్ అయినందుకు గర్వంగా భావిస్తున్నాను
- బీసీ వర్గాల హక్కులు, రిజర్వేషన్ల రక్షణ కోసం న్యాయపోరాటంలో భాగస్వామి కావడం నా జీవితంలో ఒక గర్వకారణం
- బిఆర్ఎస్ పార్టీ అమీన్పూర్ మున్సిపల్ యువ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీలు ఈ దేశంలో 70 ఏళ్లుగా ఎన్నో రకాలుగా వివక్షకు గురయ్యారు. సమాజంలోని ప్రతి రంగంలో తమ కృషితో ముందుకు వచ్చినా, హక్కుల విషయంలో అన్యాయాన్ని ఎదుర్కొన్నారు. ఈరోజు బీసీల హక్కులను కాపాడే పోరాటం కేవలం ఒక వర్గం కోసం కాదు ఎ ఇది సమానత్వం కోసం, రాజ్యాంగం కోసం, ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటం.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15,16,243 లో స్పష్టంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వం, చట్టసభలు, న్యాయస్థానాలకు అధికారం ఇచ్చాయి. ఈ హక్కులు కేవలం పేపర్ మీద ఉండకూడదు అవి ప్రజల జీవితాల్లో న్యాయం, సమానత్వంగా మారాలి. ఒక లాయర్ గా అడ్వకేట్ గా నేను స్పష్టంగా చెబుతున్నా బీసీల హక్కుల కోసం జరిగే ఈ చారిత్రాత్మక న్యాయపోరాటంలో చివరి వరకూ బీసీ వర్గాల పక్షాన నిలబడతాను.న్యాయవ్యవస్థ కూడా బీసీల హక్కులను కాపాడి,రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా తీర్పు ఇస్తుందని మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తున్నాను. ప్రజాక్షేత్రం, సామాజిక సంస్థలు, న్యాయవేదికలు కలసి బీసీల హక్కులను కాపాడాలి.రిజర్వేషన్ అనేది బహుమతి కాదు, అది చట్టబద్ధమైన హక్కు.ఆ హక్కు కోసం బుధవారం ప్రారంభమైన ఈ న్యాయయుద్ధం బీసీల చరిత్రలో ఒక మలుపు కావడం ఖాయం అని ఆయన చెప్పారు.

## కాంగ్రెస్ నాయకుల్లారా ఖబర్దార్..

- అభివృద్ధిని మరిచి హరీష్ రావు పై విమర్శలా....!
- బీఆర్ఎస్ హయాంలో వచ్చిన అభివృద్ధి పనులకు మీరు శంకుస్థాపనలు చేస్తున్నారు.
- దమ్ముంటే అందోల్ అభివృద్ధిపై చర్చకు రండి.
- హరీష్ రావు పై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలపై బి ఆర్ఎస్ నాయకులు ఫైర్.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ నాయకుల్లారా ఖబర్దార్ అధికారంలో ఉండి అభివృద్ధి పనులు చేపట్టడం చేతకాక సమస్యలను ఎత్తి చూపుతున్న బిఆర్ఎస్పై, మాజీ మంత్రి హరీష్ రావు పై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని బి ఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా ఆందోల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల జైపాల్ రెడ్డి, పైతర సాయికుమార్,లింగాగౌడ్, నారాయణ లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి హరీష్ రావు పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు.ఆదివారం వట్పల్లిలో నిర్వహించిన అలైబలై కార్యక్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్న అప్రజాస్వామిక పాలన, అమలు కానీ హామీలు ఇతర సమస్యలపై హరీష్ రావు మాట్లాడితే దానినీ జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు ఆయనపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమానికి వేల సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో దాన్ని చీర్నించుకోలేక సమస్యలను ఎత్తి చూపిన బీఆర్ఎస్పై ఎదురు దాడికి దిగుతున్నారని మండిపడ్డారు.గ్రామాల్లో చెత్త ఎత్తివేసేస్థితిలో లేని మీరా అభివృద్ధి గురించి మాట్లాడేది..? అని వారు అన్నారు.మీ సారూ మంత్రి అయ్యి రెండేళ్లయింది ఏదైన ఒక్క గ్రామ అభివృద్ధి కి ఒక్క పైసా అయినా ఇచ్చిండా మీ మంత్రి అని వారు ప్రశ్నించారు. హరిశన్న మంత్రిగా వున్నప్పుడు మా ఎం ఎల్ ఏం క్రాంతి కిరణ్ చొరవతో ఒక్కో గ్రామానికి యాభై నుంచి కోటి రూపాయల వరకు అభివృద్ధి నిధులు ఇచ్చాడన్నారు. మీ ఊర్లో పోయి చూడండి తెలుస్తుంది...సిసి రోడ్లు, డ్రైనేజి లు పల్లె ప్రకృతి వనాలు, స్మశానా వాటికలు ఇంటింటికి తాగే నీళ్లు ఇవి కల్పించింది.బి ఆర్ ఎస్ ప్రభుత్వం కాదా హరీశన్న కాదా అన్నారు. మీ సారూ జేబులో కత్తెర పట్టుకొని తిరుగుతూ రిబ్బన్ లు కట్ చేస్తున్నాడు కదా ఆ బడ్జెట్ ఎప్పుడు మంజూరు అయిందో తెలుసుకుని మాట్లాడండని పితువు పలికారు.ప్రతి తాండాకు రోడ్డు టిఆర్ఎస్ మంజూరు చేయించిందే అల్లదుర్గం నుంచి రైకోడ్ వరకు,బ్రాహ్మణ పల్లి నుంచి సింగూర్ వరకు, సంగుపేట నుంచి ముద్దయిపేట వరకు, మునిపల్లి నుంచి సింగూర్ వరకు టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేసిన పనులే అని వారు ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులను తీవ్రంగా ఎద్దేవా చేశారు.

## రాకేష్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

- 11న అంబేద్కర్ భవన్లో రౌండ్ టేబుల్ సమావేశం
- బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు లింగాల రవికుమార్



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై సుప్రీంకోర్టులో బూటు విసిరిన రాకేష్ కిషోర్ పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని ఈనెల 11న ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని సామాజిక ఉద్యమ నేత, బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, న్యాయవాదులు, కుల సంఘాలు, ప్రజా సంఘాల నేతలు, విద్య, ఉద్యోగ, వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని లింగాల రవికుమార్ కోరారు. రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం నిరసన కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# వామపక్ష సిసలైన నాయకుడు పుసులూరి రంగన్న...

- ఘనంగా పుసులూరి సంస్మరణ సభ
- బాగం హేమంతరావు సిపిఐ జాతీయ కమిటీ సభ్యులు.
- సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి రెడ్డి, మాజి ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య.




**మహబూబాబాద్ జిల్లా,అక్టోబర్ 9(పిసిడబ్ల్యూ న్యూస్):** సిపిఐ పార్టీలో వామపక్ష భావజాలంతో పేదల అభ్యున్నతికి,సమాజ శ్రేయస్సు కు దోహదాపడడానికి,అలాగే కుటుంబానికి సమ న్యాయంతో వ్యవహరించిన మహనీయుడని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి రెడ్డి అన్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా,జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారని అన్నారు.పుసులూరు రంగన్న సంస్మరణ సభ మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో గురువారం కమ్మ ఫంక్షన్ హాలులో సిపిఐ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా ఆ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కమిటీ సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్,ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య, సిపిఎం జిల్లా నాయకులు మండ రాజన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పాల్గొని మాట్లాడుతూ కుటుంబంలో,సమాజంలో అందరి మన్నలను పొంది సిపిఐ పార్టీ అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి అని,ఒకే పార్టీలో ఉంటూ పార్టీని వీడకుండా పలువురికి ఆదర్శంగా పనిచేశారని తెలిపారు.నిత్యం పేద ప్రజల బాగోగుల కోసం తపించే వారని తన జీవితంలో రంగన్న భార్య ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో మృతి చెందడం,అది మరిచిపోక ముందే రంగన్నను కోల్పోవడం పార్టీకి,కుటుంబ సభ్యులకు తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు.వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. రంగన్న సంస్మరణ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు శ్రీలత, శ్రీలక్ష్మి అమ్మానాన్న ప్రేమలను ఎన్నటికీ మర్చిపోమని వారి తండ్రి సంస్మరణ సభలో గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.మా అమ్మా నాన్నలు ఆడపిల్లలమని ఎప్పటికీ దిగులు పడలేదని,మా పెళ్లిళ్లు అయిన తర్వాత కూడా అల్లుళ్లను కూడా సొంత కొడుకుల వలె ప్రేమించారని, వారి సేవలను గుర్తు చేసుకున్నారు. మా అమ్మానాన్నలు ఆస్తిపాస్తులు ఇవ్వకున్నా,మంచి సంస్కారం ఇచ్చారని వారి లాగా మా అత్త వారి కుటుంబ సభ్యులు ఎంతో తోడ్పాటును ఇచ్చారని,ఈ సందర్భంగా వారి కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, సిపిఐ మహిళా సంఘం జిల్లా నాయకురాలు నాదెండ్ల పద్మ, జిల్లా కమిటీ సభ్యులు అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్, ఇల్లందు నియోజకవర్గ సిపిఐ నాయకులు,సిపిఎం మండల కార్యదర్శి నంబూరి మధు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,తిరుమల ప్రభాకర్ రెడ్డి,మూల మధుకర్ రెడ్డి, సత్తిరెడ్డి, కళింగ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను త్వరతిగతిన పూర్తి చేయాలి

- బీజేపీ రాష్ట్ర కోశాధికారి డి. వాసుదేవరావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు
- రూ.25.41 కోట్లతో మోడల్ స్టేషన్‌గా రూపుదిద్దుకుంటున్న రైల్వే స్టేషన్
- ప్రయాణికుల సౌకర్యాలే బీజేపీ ప్రభుత్వ ధ్యేయం





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గురువారం ఈ పనుల పురోగతిని బీజేపీ రాష్ట్ర కోశాధికారి డి. వాసుదేవరావు, భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ప్రత్యక్షంగా పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులను వారు రైల్వే అధికారులతో కలిసి సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా రైల్వే వ్యవస్థను ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నారని, ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ. 25.41 కోట్ల నిధులు కేటాయించబడి, పనులు దశలవారీగా వేగంగా సాగుతున్నాయన్నారు. ఈ స్టేషన్ ద్వారా రోజూ 83 రైళ్లు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. సూపర్‌ఫాస్ట్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్రధాన నగరాలకు వెళ్లే పలు రైళ్లు ఇక్కడ ఆగుతుండటంతో ఖమ్మం రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడిందని ఆయన తెలిపారు. స్టేషన్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రధాన భవనం ముఖద్వారం పునర్నిర్మాణం, ఆకర్షణీయమైన ప్రధాన ప్రవేశ ద్వారం నిర్మాణం, 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం, రెండు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు ఏర్పాటు, ఆధునిక వెయిటింగ్ హాల్స్, శుభ్రమైన వాష్‌రూములు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, విస్తృత పార్కింగ్ సదుపాయాలు వంటి పనులు జరుగుతున్నాయి. అదనంగా ప్రయాణికుల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు, సెక్యూరిటీ కంట్రోల్ రూమ్ వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రయాణికుల రక్షణ కోసం సిఆర్పిఎఫ్ పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణం కూడా కొనసాగుతోంది. బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని, అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఖమ్మం రైల్వే స్టేషన్ తెలంగాణ రాష్ట్రంలో ఒక మోడల్ స్టేషన్‌గా నిలుస్తుందని, ఇది ఖమ్మం ప్రజలకు గర్వకారణంగా మారుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ మాజీ అభ్యర్థి నున్న రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ తొండెపు సైదేశ్వరరావు, జిల్లా నాయకులు వేల్పుల సుధాకర్, మంద సరస్వతి, మార్తి ప్రసాద్, ఈదుల భద్రం, గడిల నరేష్, ఆర్.వి.ఎస్. యాదవ్, దుద్దుకూరి కార్తీక్, పసుమర్తి సతీష్, డి.కొండ శ్యామ్, శాసనాల సాయిరాం, మండల నాయకులు పాలెపు రాము, కడుదుల ప్రభాకర్, నాగవల్లి రామచంద్రం, గుత్తా వంశీ, భూక్య బాలాజీ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిపిఐ అభ్యర్థులకు స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు పట్టం కట్టాలి

- పొత్తులతో సంబంధం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటి చైర్మన్ నలు సుధాకర్ రెడ్డి



**కురవి అక్టోబర్ 09(పి.సి.డబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ ప్రాతినిధ్యం పెంచే విధంగా పొత్తులతో సంబంధం లేకుండా పోటీకి కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నల్లు సుధాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. మరిపెడ మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార పార్టీ పొత్తుతో సంబంధం లేకుండా, మన పార్టీ ప్రాతినిధ్యం పెంచే విధంగా బలమైన అభ్యర్థులను ఎంపిక చేసి పోటీలో నిలుపుదామని అన్నారు గత బీఆర్ఎస్ పదేండ్ల ప్రజా వ్యతిరేక పాలన, బిజెపి అవలంబిస్తున్న మతతత్వ ,నియంతృత్వ విధానాలను ప్రతిఘటించే విధంగా వారికి బుద్ధి చెప్పి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సిపిఐ అభ్యర్థులకు స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు పట్టం కట్టాలని కోరారు.సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయ్ పై మనువాదుల దాడి భారత రాజ్యాంగ వ్యవస్థ పై జరిగిన దాడి అని, ప్రతీ ప్రజాస్వామిక వాది ఖండించాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, గాడిపల్లి వెంకన్న తురక రమేష్, పాల్గొన్నారు

# జూనియర్ కళాశాల సిబ్బంది లక్ష్మమ్మ పదవీ విరమణ


- హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి కటకం అంజయ్య, ప్రిన్సిపాల్ అంజయ్య






**బెల్లంపల్లి అక్టోబర్ 09(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సిబ్బంది కొయ్యాడా లక్ష్మమ్మ పదవి విరమణ మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి కటకం అంజయ్య, జిజేఎల్ఏ బాధ్యులు లక్ష్మణరావు వివిధ కళాశాల ప్రిన్సిపాల్ హాజరు అయ్యారు. లక్ష్మమ్మ ఉద్యోగ విరమణ ఆమెతో వారు పొందిన అనుభవాలను నెమరు వేసుకున్నారు. లక్ష్మమ్మ ప్రభుత్వ కళాశాల యందు ఎంతగానో ఓపికతో సహనంతో తన ఉద్యోగ విధులను నిర్వర్తించడం జరిగిందని పలువురు ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య మన కళాశాల గ్రీనరీ శుభ్రత మంచినీటి సౌకర్యం ఇవన్నీ కూడా ఎంతగానో కష్టపడి పిల్లలను తన కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేశారని తన శేష జీవితం ఆయురారోగ్యాలతో జీవించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకే ఇతరులు తన కుటుంబ సభ్యులు విద్యార్థిని. విద్యార్థులు పాల్గొన్నారు.

# రామంతపూర్ ఏఈ మౌనికపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి: జర్నలిస్ట్ విజయేందర్ రెడ్డి



DATE : 9-10-2025

TO,
THE DEPUTY COMMISSIONER,
GHMC UPPAL CIRCLE-2 ,
TELANGANA STATE,

Subject : Request Regarding to suspend the Ghmc Circle -2 Assistant Engineer Ramanthapur for Giving Negligency Answers with rudely Infront of the Higher Officials and Misguiding the Ghmc Deputy Commissioner about the Techinical report
*******

Respected Sir,

I A . Vijayender Reddy senior Journalist Raftaar National Media Bureau Chief Tg & Ap Resiudent of Hno: 3-4-63/39/2/19 venkat sainagar colony Saikrishna nagar colony Ramanthapur Uppal Constituency medchal District Telangana State Mobile no: 8019992283. Would like to bring kind notice that I along with our Colony residence Requested her excelency president of India, His excellency prime minister of india , Honourable Governor of Tg , Honourable Chief minister of Tg , Honourable Ministers & Honourable MLC'S, Honourable MP'S Honourable MLA Uppal Constituency Honourable Chief Secretry of Tg, Principal Secretry M&UD ,Ghmc Mayour, Ghmc Deputy Mayour , Ghmc Commissioner , Ghmc LbZonal Commissioner , Honourable Collector Medcahl District , Honourable Additional Collector Local bodies Medcahl District to sanction of box culvert Bridge **near Beerapa temple Backside line Survey no :40/A&40 25 feet Road** on musi Canal the residents may easy to pass from center of the colony to straight way There is 25 feet road back side line of Beerapa temple lane it also helps for devoties who is coming from other colonies to beerapa temple. For that after considering the Above Dignitaries Request Our Ghmc Circle has Visited the Site observed the Site location and prepared estimation by taking the Clarification from the various departments and technical reports the Lbnagar Zonal Commissioner has Sanction Construction of box culvert at Venkat saingar colony in saikrishna nagar colony **near Beerapa temple Backside line Survey no :40/A&40 25 feet Road** on 17-jun2025 Proc no :368000/eng/zc/Ghmc -2025-2026 Administrative Sanction of Rupees 3450000/- . Tender has completed for the Sanction Work after Completion of Tender some of the Anti Social Elements trying to shift the Location of the Sanction culvert since 14//7/2025 to till date work was not started by our officials for 3 Months . **today Date 08/10/2025 I visted Engineering department in circle -2 office to enquiry when our work is going to start suddenly I listed a shock news that our officials Trying to change the location Intensionally for sanctioned Culvert and they wants to shift the location to Musi canal Occupied area where the anti social elements blocked the SNDP water and Musi Canel water by laying the pipes inside the canel .But our officials never taken any action against that antisocial elements but our officails are Trying to Encourage the Musi canal Occupied persons to shifting of location to be laid on musi canel illegally occupied**

**ఉప్పల్ అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామంతపూర్ భగయత్ కాలనీ, వెంకట సాయి నగర్, సాయి కృష్ణ కాలనీలో బీరప్ప దేవాలయం వెనుక లైన్‌లో సాంక్షన్ అయిన బాక్స్ కల్వర్ట్ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని జర్నలిస్ట్ విజయేందర్ రెడ్డి ప్రశ్నించగా, బాక్స్ కల్వర్ట్ మరోచోట వేస్తాం అని సర్కిల్-2 ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు.దీంతో జర్నలిస్ట్ విజయేందర్ రెడ్డి వెంటనే జీహెచ్ఎంసి సర్కిల్-2 ఉప కమిషనర్ రాజును కలిసి వివరాలు తెలియజేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డిఈ నాగమణి, ఏఈ మౌనికను పిలిచి వివరణ కోరగా, ఆమె తప్పు సమాచారం ఇచ్చారు. ఆ లొకేషన్‌లో కల్వర్ట్ సాంక్షన్ కాలేదు. టెక్నికల్ రిపోర్ట్ ప్రైవేట్ వ్యక్తులతో చేయించుకున్నారు. మేము ఎలాంటి రిపోర్ట్ ఇవ్వలేదు, అని ఏఈ మౌనిక పేర్కొంది.ఈ సందర్భంలో జర్నలిస్ట్ విజయేందర్ రెడ్డి తన మొబైల్ లో జీహెచ్ఎంసి ఉప కమిషనర్‌కు టెక్నికల్ రిపోర్ట్ చూపించారు. అదే సమయంలో పై అధికారులకు ఎందుకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు అని అడిగితే, ఏఈ మౌనిక మీరు ఎవరు నాను అడగడానికి? మా ఇష్టం వచ్చిన చోట మేము వేస్తాం. మాకు ఎక్కడ వేయాలో తెలుసు,అంటూ పై అధికారుల సమక్షంలో అవమానకరంగా ప్రవర్తించింది.జర్నలిస్ట్ విజయేందర్ రెడ్డి మనోభావాలను దెబ్బతీసే రీతిలో వ్యవహరించిన ఏఈ మౌనిక పై క్రమశిక్షణ చర్యలు తీసుకొని, విధుల నుంచి తొలగించాలని ఆయన జీహెచ్ఎంసి ఉప కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు.ఒక బాధ్యత గల జర్నలిస్టుతో ఇలా మాట్లాడితే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. త్వరలో ఈ అంశంపై రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, జీహెచ్ఎంసి కమిషనర్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, లోకాయుక్త జడ్జి వద్ద ఫిర్యాదు చేయనున్నట్లు విజయేందర్ రెడ్డి తెలిపారు.


# బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షిరామ్ వర్ధంతి



**యాదాద్రి అక్టోబర్ 09(పి.సి.డబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లాకమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గందమల్ల లింగస్వామి అధ్యక్షతన బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షిరాం వర్ధంతి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు మంచాల శ్రీకాంత్, , దయాకర్ మౌర్య హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ పుట్టిందే బీసీల కోసం పెట్టారన్నారు.ఇవాళ బీసీలకు వాటా దక్కింది అంటే అది కాన్షిరాం వల్లనే అన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అనే నినాదంతో ముందుకెళ్లి జిల్లాలో బహుజన సమాజ్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయం సాధిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి బాసాని మహేందర్,జిల్లా అధ్యక్షులు గందమల్ల లింగస్వామి,సీనియర్ నాయకులు బట్టు రాంచంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుండు కృష్ణ గౌడ్,జిల్లా ఈసీ మెంబర్ వడ్డేపల్లి దాసు,కోయిగురి వెంకటేష్ యాదవ్,కొంగరి బాలరాజ్, సురుపంగా శ్రీకాంత్,అసెంబ్లీ బివిఎఫ్ కన్వీనర్ సిలువేరు మహేందర్,వలిగొండ మండల అధ్యక్షుడు సుక్క శ్రీకాంత్, భువనగిరి పట్టణ అధ్యక్షుడు బర్రె నగేష్,గోపి నరేందర్,మౌలానా, మురళి,అర్జున్,పాల్గొన్నారు.

# ఆరు గాలం పని చేసిన తీరని రైతు బాధలు..

## - అలసిపోయి వడ్ల పైన సేద తీర్చుకుంటున్న కవడే లక్ష్మమ్మ....



**వలిగొండ, అక్టోబర్ 09(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఈ రోజు వలిగొండ లోని వడ్ల ను ఎండబోసి అలసిపోయి వడ్లపైనే పడుకున్నాది. ఇంకా వడ్ల కొనుగోలు కేంద్రాలు తొందరగా ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యుత్ షాక్తో యువకుడి మృతి

**ములుగు అక్టోబర్ 09(పి.సి.డబ్ల్యూ న్యూస్):** విద్యుత్ షాక్తో యువకుడు మృతి చెందిన ఘటనములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో జరిగింది. స్థానికుల వివరాలు.. పస్రా గ్రామంలోని ఓ రైస్ మిల్లు నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో ఉత్తర ప్రదేశ్కు చెందిన బహుగుడా యాదవ్ (20) అనే వ్యక్తికి వెల్డింగ్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలింది. తోటి కార్మికులు స్పందించి వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

# వలిగొండకి సివిల్ సప్లై ఆఫీసర్ చౌహాన్





**వలిగొండ అక్టోబర్ 09(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఈరోజు వలిగొండ కు విసిటింగ్ లో భాగంగా సివిల్ సప్లై ఆఫీసర్, డిఎస్ చౌహాన్ గారు వలిగొండ మార్కెట్ యార్డ్ ని క్షుణ్ణంగా పరిశీలించారు, వడ్ల కొనుగోలు కేంద్రాలను, మరియు అవి ఒడ్లు రకాలను అడిగి తెలుసుకున్నారు అవి పండే విధానాలను రైతులను అడిగి తెలుసుకున్నారు వడ్లను చేతులో వేసుకొని చేతులను బాగా జోడించి వడ్ల యొక్క తేమశాతాన్ని చూశారు.


# మానకొండూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పిఈటి శివను తక్షణమే సస్పెండ్ చేయాలి




- మానకొండూర్ గురుకుల పిల్లలపై గుదిబండ
- పట్టించుకోని ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది.
- పూర్తి అధ్వానంగా మారిన బాత్రూంలు స్నానాలు గదులు.
- గడిచిన నాలుగు నెలలుగా వేతనాలు రాని కాంట్రాక్టు సిబ్బంది.
- కాంట్రాక్టర్లకు గడిచిన నాలుగు నెలలుగా బిల్లులు రాకపోవడంతో పని మానేసిన కాంట్రాక్టర్లు.
- నామమాత్రంగా ఉన్న పాఠశాల తల్లిదండ్రుల సంఘం.
- వాటర్ ప్యూరిఫైయర్ని గాలికి వదిలేసిన సిబ్బంది.
- కిటికీలకు ఊచలు లేవు డోర్లు లేవు.
- సమస్యలపై ప్రశ్నిస్తున్న తల్లిదండ్రుల విద్యార్థులను టార్గెట్ చేస్తున్న ప్రిన్సిపాల్ పిఈటి శివ
- అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగాలను అమ్ముకుంటున్న ప్రిన్సిపాల్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాణ్యమైన విద్య ఆహారం మౌలిక వసతులు కల్పిస్తూనే తెలంగాణ లోని గురుకుల పాఠశాలలను కేజీ టు పీజీ విద్యలో భాగంగా గత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఒకప్పుడు ఇదే గురుకుల పాఠశాలల నుండి ఎంతోమంది డాక్టర్లు ఇంజనీర్లుగా పైలెట్లుగా ప్రపంచ రకార్డులు సృష్టించేటటువంటి విద్యార్థులుగా తయారు చేసినటువంటి గురుకులాలు ఇప్పుడు దీనావస్థలోకి, అనాధల, మార్చేసిన రాష్ట్ర ప్రభుత్వం అధికారులు సిబ్బంది. బాత్రూంలో సరిగా లేక అలాగే వాటిని శుభ్రపరచగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్నానం చేయడానికి పరిశుభ్రమైన నీరు లేక రెండు రోజులకు ఒకసారి లేదా మూడు రోజులకోసారి విద్యార్థులు స్నానాలు చేయడంతో వారికి అనేక తీవ్రమైన గజ్జి తామర వంటి చర్మ వ్యాధులు ప్రబలుతున్నాయి. పరిశుభ్రమైన త్రాగునీరు లేక పిల్లలు మురుగువాసన వస్తున్నటువంటి నీటిని తాగుతున్న పరిస్థితి మానకొండూరు గురుకుల పాఠశాలలో దాపరించింది. కెమికల్ వేయాల్సిన పైపు సెన్సార్ తీసి కింద పడేసి ఉన్నది. టెస్టింగ్ కిట్టు లేదు. నీళ్లు శుద్ధి చేసిన తర్వాత ఆ నీళ్లలో నాచు కనిపిస్తా ఉన్నది. బాత్రూం డోర్లు సరిగా లేవు నల్లాలు రిపేర్ చేయించక వృధాగా నీరు పోతా ఉంది వాటిని పట్టించుకోవట్లేదు. విరిగిపోయిన నల్లాల దగ్గర కొత్త నల్లాలు బిగించట్లేదు. దాంతో మరుగుదొడ్లకు వెళ్లిన



విద్యార్థులు నీరు పోసే పరిస్థితి లేకుండా పోయింది. దీనివల్ల మరుగుదొడ్లు విపరీతమైన దుర్వాసన వచ్చి మళ్లీ లపలికి వెళ్లే పరిస్థితి లేకుండా తయారయింది. విద్యార్థులకు చర్మవ్యాధులు గాని నీరు శుద్ధి లేకపోవడం వల్ల వస్తున్నటువంటి వాంతులు విరోచనాలు సంభవించినప్పుడు పూర్తిస్థాయిలో వారికి ఆరోగ్య పరమైన చర్యలు తీసుకోవడం లేదు అలాగే కనీసం రోగం చిన్నగా ఉన్నప్పుడే పిల్లల తల్లిదండ్రులకు సమాచారం కూడా అందించడం లేదు ఒకవేళ సమాచారం అందించిన తప్పుడు సమాచారం అందిస్తున్నారు. దీనివల్ల పిల్లలకు సరియైన ట్రీట్మెంట్ అందగా గజ్జి తామర విరోచనాలు వంటి రోగాలు తీవ్రతరం అయి పిల్లల ప్రాణాల మీదికి వస్తున్న పరిస్థితి. పి ఈ టి శివ, తన మిత్రులు మద్యం బయట సేవించి పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నారు. దీనివల్ల పిల్లలకు ఏం నేర్పిస్తున్నట్టు వీళ్ళు. ఇన్ని సమస్యలపై తక్షణమే సంబంధిత గురుకుల సంస్థ జోనల్ ఆఫీసర్ కావచ్చు జిల్లా కలెక్టర్ గారు తక్షణమే చర్యలు తీసుకొని పిల్లలకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యలపై ప్రధానోపాధ్యాయులు జగనాదంని ప్రశ్నించిన అనంతరం రోడ్డుపై భారీ ధర్నా కార్యక్రమం తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. దీంతో ప్రధానోపాధ్యాయులు సమస్యలు అన్నింటిని ఒక వారం రోజుల్లో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు చక్కబెడతానని మాట ఇవ్వడంతో ధర్నాను తల్లిదండ్రులు విరమించారు. వారం రోజుల లోపల సమస్యలు పరిష్కరించకపోతే ఈసారి కలెక్టరేట్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందని తల్లిదండ్రులు హెచ్చరించారు. **విద్యార్థుల తల్లులకి ఫోన్లు చేసి ఇష్టానుసారంగా మాట్లాడుతున్న పి ఈ టి శివ.** ఇదే పాఠశాలలో కొన్ని సంవత్సరాలుగా పొరుగు వరి సేవ పద్ధతిలో పి ఈ టి గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్ ఆయా విద్యార్థుల తరగతి వాట్సాప్ గ్రూపులలో ఉన్న ప్రొఫైల్ ఫోటోలు చూసి ఆడవారి ప్రొఫైల్ ఫోటోలు ఉంటే గనక వారికి వ్యక్తిగతంగా ఫోన్లు చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నటువంటి పిఈటి శివకుమార్ను తక్షణమే విధుల నుండి తొలగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని జోనల్ ఆఫీసర్ కి కలెక్టర్ కి ఒక వారం తర్వాత వినతి పత్రం సమర్పిస్తాం అని తల్లిదండ్రులు హెచ్చరించారు. **అద్వాన్న పరిస్థితుల్లో నీటి శుద్ధీకరణ యంత్రం.** గురుకుల పాఠశాల కళాశాల పిల్లలకు సిబ్బందికి తాగునీటి సౌకర్యార్థం ప్రభుత్వం చేత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసినటువంటి నీటి శుద్ధికరణ యంత్రం సరిగ్గా పనిచేయడం లేదు. ఆ యంత్రం



పనిచేసే విధానము అక్కడున్నటువంటి ఏ సిబ్బందికి కూడా పూర్తిస్థాయిలో తెలవదు కనీసం దాన్ని ఏ విధంగా ఆపరేట్ చేయాలనేటువంటి విషయం కూడా తెలియదు. దీంతో అందులో నుంచి బయటికి వస్తున్నటువంటి నీరు పూర్తిస్థాయిలో నాచు తయారయింది. తక్షణమే దీని మరమ్మత్ చేసి పిల్లలకు శుద్ధి చేసిన మంచిది నేరు అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. **అంశాలపై స్పందించిన ప్రధానోపాధ్యాయులు జగన్నాథం.** గడిచిన నాలుగు నెలలుగా పొరుగు వరి సేవ పద్ధతిలో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులకి ఉపాధ్యాయేతర సిబ్బందికి కాంట్రాక్టర్లకు అలాగే రెగ్యులర్ ఉపాధ్యాయులకు బిల్లులు జీతాలు ప్రభుత్వం మంజూరు చేయలేదు. అందుకే కాంట్రాక్టులు పొందినటువంటి వారు స్లీపింగ్ శానిటేషన్ పండ్లు చేయలేని పరిస్థితి నెలకొంది కాబట్టి బాత్రూంలో ఎంత దీనావస్థలో ఉన్నాయి ఈ సమస్యలన్నింటినీ కూడా మా పై అధికారులైనటువంటి జోనల్ ఆఫీసర్ కి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారం రోజుల లోపు సమస్యలన్నీ పరిష్కరిస్తానని వారు తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు దీంతో ధర్నాను నిలిపివేసిన తల్లిదండ్రులు. వారం రోజుల తర్వాత మళ్లీ పాఠశాలకు వచ్చి సమస్యలు పరిష్కరించారని నిర్ధారించుకున్న తర్వాత పిల్లల్ని హాస్టల్కు పంపిస్తామని అప్పటివరకు పంపించమని తల్లిదండ్రులు చెప్పినట్టు సమాచారం. ఒకవేళ సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందించి ఆ తర్వాత ధర్నా చేస్తామని చెప్పి హెచ్చరించిన తల్లిదండ్రులు. ఈ కార్యక్రమంలో సదానందం మోజేష్ సంపత్ మహేష్ కిరణ్ కుమార్ తదితరుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

---

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బంది చర్యలు

**● స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు క్రిష్ణ ఆదిత్య ● ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌తో కలిసి సంబంధిత నోడల్ అధికారులతో సమీక్షించిన ఎన్నికల పరిశీలకులు**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు క్రిష్ణ ఆదిత్య అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి సంబంధిత నోడల్ అధికారులతో గురువారం ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు క్రిష్ణ ఆదిత్య మాట్లాడుతూ.. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎక్కడైనా కోర్టు కేసులు నమోదు అయ్యాయా, రీపోల్ జరిగిందా వంటి అంశాలను పరిశీలించి రిపోర్టు అందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ సంపూర్ణంగా అందించాలని అన్నారు. ప్రతి అధికారి ఎన్నికల నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పోలింగ్ ప్రక్రియ వెబ్ కాస్టింగ్ లేదా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించేలా చూడాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా చూడాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ ముద్రణకు చర్యలు తీసుకోవాలని, అవి ఎట్టి పరిస్థితుల్లో బయటకు పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలన్స్ బృందాలు మరింత విస్తృతంగా విధులు నిర్వహించాలని అన్నారు. సమీక్ష లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో మొదటి విడతలో 149 ఎంపిటిసి, 10 జడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ అధికంగా ఉంటుందని, అధికారులు నిబంధనల పట్ల అవగాహన లేని పక్షంలో విధుల నిర్వహణ కఠినతరం అవుతుందని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది తమ హక్కులు, బాధ్యతలు సంపూర్ణంగా తెలిసి ఉండాలని, ప్రతి రూల్ పొజిషన్ పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా అందించామని కలెక్టర్ తెలిపారు. ట్రైనింగ్ కు హాజరు కాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున మొత్తం 20 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, 15 స్టాటిక్ సర్వీసెస్ బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 713 పోలింగ్ లొకేషన్స్ లలో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియ ను పూర్తి స్థాయిలో మానిటరింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశం ఉన్న భవనాలను పరిశీలించడం జరిగిందని, బ్యాలెట్ పేపర్ ను పకడ్బందీగా ముద్రణ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేసి ఎప్పటి కప్పుడు ఎన్నికలకు సంబంధించిన విషయాలు మీడియాకు తెలిసేలా చర్యలు చేపట్టామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిపోర్టింగ్ పక్కాగా జరిగేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ప్రచార ఖర్చుల మానిటరింగ్ ప్రక్రియ నిబంధనల ప్రకారం జరగాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుగా కంట్రోల్ రూమ్, అవసరమైన అకౌంటింగ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్సు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య , డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, ఆర్టిఓ వెంకట రమణ, సిపిఓ ఏ. శ్రీనివాస్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, డి.వై.ఎస్.ఓ. సునీల్ రెడ్డి, డిసిఓ గంగాధర్, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి జి. పుల్లయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

# పూల వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**● ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మోయిన్, షేక్ ఖాజా ● పూలు అమ్మకం దారులకు గుర్తింపు కార్డులు**







**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న పేద, మధ్య తరగతి కి చెందిన పూల వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మోయిన్, షేక్ ఖాజా లు కోరారు. ఖమ్మం నగరంలో వివిధ ప్రాంతాల్లో పూలు అమ్ముకొనే వారికి 'ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్' తో గురువారం ఫోటో గుర్తింపు కార్డులను స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రం ఏరియాలో ఖమ్మం లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ ఓనపాకల రమేష్ చేతులు మీదుగా ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్. మోయిన్, షేక్ ఖాజా ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఖమ్మం లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ ఓనపాకల రమేష్ మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలో పూల వ్యాపారులకు లేబర్ ఆఫీస్ నుండి ఇన్సూరెన్స్ చేపిస్తామని, అవకాశం ఉన్న మేరకు లేబర్ ఆఫీస్ నుండి తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలో గత అనేక సంవత్సరాల నుండి వివిధ ప్రాంతాల్లో సుమారు మూడు వందల మంది రకరకాల పూలు, పూల దండలు, పూల బోకేలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న పేద మధ్యతరగతి పూల అమ్ముకునే వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ పూల వ్యాపారులకు అండదండగా ఉంటూ అన్ని విధాలా ఆదుకుంటుందని, ప్రభుత్వం కూడా పూల వ్యాపారులకు ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఆంక్షలు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ గౌరవ సలహాదారులు షేక్. మసూద్, కార్యదర్శి ఆర్.పీటర్, కోశాధికారి శాబాస్ అహ్మద్, కన్వీనర్ షేక్. ముజాయిద్దిన్, కార్యవర్గ సభ్యులు షేక్. నాగుల్ మీరా, వై. వినోద్, డి. శేఖర్, షేక్. ఈసూబ్, కృష్ణ వేణి, లాల్ బీ, జానిబీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నాపై దాడి నాటకం కాదు..

## నిజంగానే జరిగింది: సైఫ్ అలీఖాన్



బాలీవుడ్ ప్రముఖ నటుడు సైఫ్ అలీఖాన్, తనపై ఈ ఏడాది జనవరిలో జరిగిన దాడి ఘటనపై తాజాగా స్పందించారు. ఆ దాడిని కొందరు ఒక నాటకంగా ప్రచారం చేయడం తనను తీవ్రంగా బాధించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిసార్లు వాస్తవాలను కూడా జనం నమ్మరని, మనం అలాంటి సమాజంలో జీవిస్తున్నామని అన్నారు.

ఇటీవల ఓ టాక్ షోలో పాల్గొన్న సైఫ్ ఈ విషయంపై మాట్లాడుతూ, "ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినప్పుడు నేను నడుచుకుంటూ బయటకు వచ్చాను. అంబులెన్స్ లేదా వీల్‌చైర్‌లో కనిపిస్తే నాకేదో తీవ్రమైన గాయాలయ్యాయని అభిమానులు కంగారుపడతారని భావించాను. నేను బాగానే ఉన్నానని వారికి భరోసా ఇవ్వడానికే అలా చేశాను. కానీ, కొందరు దీన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. అసలు దాడే జరగలేదని, ఇదంతా కేవలం ఒక నాటకమని ప్రచారం చేశారు. కానీ నా గాయాలు, నా పరిస్థితి పూర్తిగా నిజం" అని వివరించారు. ఈ ఏడాది జనవరి 16న సైఫ్‌పై ఓ దుండగుడు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ముంబయి పోలీసులు... బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. కేవలం రూ.30 వేల కోసమే అతను ఈ దాడికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వారం రోజుల చికిత్స అనంతరం సైఫ్ కోలుకున్నారు. ఈ ఘటన తన జీవితంలో ఒక తీవ్రమైన అనుభవమని, మీడియా, అభిమానుల స్పందన కూడా తనకు ఒక పాఠం నేర్పిందని సైఫ్ పేర్కొన్నారు.

# త్రివిక్రమ్-వెంకీ కాంబో

## హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్






నువ్వు నాకు నచ్చావ్ సినిమా తర్వాత వెంకటేశ్ , త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో ఫుల్ లెంగ్త్ సినిమా రాబోతుందని తెలిసిందే. ఇటీవలే గ్రాండ్‌గా లాంచ్ అయిన ఈ మూవీ త్వరలోనె సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే కొన్నాళ్లుగా సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్లుగా రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్, ఎస్ థమన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కానీ త్రివిక్రమ్ మాత్రం ఈ సారి రెగ్యులర్ మ్యూజిక్ కంపోజర్లు కాకుండా కాస్త రూటు మార్చబోతున్నాడట. ఈ చిత్రం కోసం మ్యూజిక్ లవర్స్‌కు మరింత నయా ఫీల్ అందించేందుకు యానిమల్ కంపోజర్‌ను తెరపైకి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ పేరును పరిగణనలోకి తీసుకుంటున్నాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేసేలా ఆల్బమ్‌ను ఎ÷-లాన్ చేస్తున్నట్టు తాజా వార్తలు హింట్ ఇచ్చేస్తున్నాయి. మరి వెంకీ కోసం హర్షవర్ధన్ రామేశ్వర్ ఎలాంటి బీజీఎం, మ్యూజిక్ ఆల్బమ్ రెడీ చేశాడనేది చూడాలి. ఈ ప్రాజెక్ట్‌లో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరువబోతుండగా..మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్రివిక్రమ్ మరోవైపు అల్లు అర్జున్‌తో మైథలాజికల్ ఫిల్మ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో వచ్చే సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందట.



# అనుకోకుండానే వచ్చా.. ఇక్కడే నిలిచా

## : నయనతార

లేడీ సూపర్‌స్టార్ నయనతార సినీ రంగ ప్రవేశం చేసి 22 సంవత్సరాలు పూర్తయింది. ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న ఒక భావోద్వేగభరితమైన పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

తొలిసారి కెమెరా ముందుకు వచ్చి 22 ఏళ్లు గడిచిందని నయనతార తన పోస్టులో పేర్కొన్నారు. "అనుకోకుండానే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. సినిమాలే నా ప్రపంచం అవుతాయని అస్సలు ఊహించలేదు. కానీ ఇక్కడి ప్రతి షాట్, ప్రతి ఫ్రేమ్ నన్ను నిలబెట్టాయి, ధైర్యాన్ని ఇచ్చాయి. నన్ను నేనేంటో తెలుసుకునేలా చేశాయి" అని ఆమె రాసుకొచ్చారు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తెలుగులో 'చంద్రముఖి' సినిమాతో పరిచయమైన నయనతార, అతి తక్కువ కాలంలోనే అగ్ర కథానాయికగా ఎదిగారు. బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. గతేడాది షారుక్ ఖాన్ సరసన 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లోనూ భారీ విజయాన్ని అందుకుని తన మార్కెట్‌ను పాన్ ఇండియా స్థాయికి విస్తరించుకున్నారు. ప్రస్తుతం నయనతార మెగాస్టార్ చిరంజీవి సరసన ఒక సినిమాలో నటిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ ఫ్యామిలీ, కామెడీ ఎంటర్‌టైనర్‌ను 2026 సంక్రాంతికి విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'మీసాల పిల్లా' పాట సోషల్ మీడియాలో, రీల్స్‌లో ట్రెండింగ్‌లో ఉండటం విశేషం.


# మహేశ్-రాజమౌళి సినిమా టైటిల్...'వారణాసి'?

## 'అవతార్' డైరెక్టర్ చేతుల మీదుగా రివీల్!



సూపర్ స్టార్ మహేశ్ బాబు, స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న పాన్-వరల్డ్ సినిమా గురించి ఒక సెన్సేషనల్ అప్డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు అత్యంత రహస్యంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా టైటిల్ ను హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ చేతుల మీదుగా ఆవిష్కరించేందుకు రాజమౌళి భారీ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... ప్రముఖ హాలీవుడ్ సినిమా 'అవతార్: ద ఫైర్ అండ్ యాష్' ప్రమోషన్స్ కోసం జేమ్స్ కామెరూన్ నవంబర్ నెలలో భారత్ కు రానున్నారు. ఇదే సరైన సమయమని భావించిన రాజమౌళి, ఆయనతో తన సినిమా టైటిల్ ను అధికారికంగా ప్రకటించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 'ఆర్ఆర్ఆర్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న జక్కన్న, ఇప్పుడు తన తర్వాతి సినిమా అప్డేట్ ను కూడా అదే స్థాయిలో ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కుతున్న సినిమాకు భారతీయ నగరం పేరు పెట్టడం ఏంటని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే, వారణాసి నగరానికి చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. కథకు కీలకమైన అంశం కావడంతోనే రాజమౌళి ఈ పేరును ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ గ్లోబ్-ట్రాటింగ్ అడ్వెంచర్ సినిమాలో బాలీవుడ్ నుంచి హాలీవుడ్ కు వెళ్లిన స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

# ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ ట్రైలర్..




కోలీవుడ్ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ నుంచి వస్తున్న మరో ఇంట్రెస్టింగ్ సినిమా డ్యూడ్. కీర్తీశ్వరన్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రేమలు హీరోయిన్ మమితా బైజు నటించింది. లవ్ టుడే, డ్రాగన్ సినిమాలతో యూత్ ఆడియన్స్ కు బాగా దగ్గరైన ప్రదీప్ రంగనాథన్ తో ప్రేమలుతో యువత మనసులు గెలిచిన మమితా జత కట్టడం ఈ ప్రాజెక్ట్ పై ఇంట్రెస్ట్ ని క్రియేట్ చేసింది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ డ్యూడ్ సినిమా ట్రైలర్ లేటెస్ట్ గా రిలీజ్ చేశారు. ప్రదీప్ రంగనాథ్, మమితా బైజు జతగా.. ఈ ట్రైలర్ చూస్తే ప్రదీప్ రంగనాథ్ మరో ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీతో వస్తున్నాడని అనిపిస్తుంది. లెఫ్ట్ హ్యాండ్ తో పనిచేసే అతను.. సిగరెట్ తాగడం మానేయాలని తన ప్రేయసి చెప్పడంతో చాక్లెట్ తింటూ అలానే మానేస్తాడు. ఐతే ప్రేయసిని దక్కించుకునే క్రమంలో అతను ఏం చేశాడు అన్నది సినిమా కథ. ఇందులో ప్రేమలు మమితా బైజు తనతో జత కట్టగా సినిమాలో డీజే టిల్లు హీరోయిన్ నేహా శెట్టి కూడా మరో హీరోయిన్ గా నటించినట్టు ఉంది. ట్రైలర్ యూత్ కి కావాల్సినంత స్టఫ్ ఉంది. ఎలాగు ప్రదీప్ చేసిన లవ్ టుడే, డ్రాగన్ సినిమాలు ఆడియన్స్ కు సూపర్ గా కనెక్ట్ అయ్యాయి కాబట్టి ఈ సినిమా కూడా అదే టార్గెట్ తో వస్తుందని చెప్పొచ్చు. ట్రైలర్ అంతా కూడా ప్రదీప్ రంగనాథన్ ఎనర్జీతో అదరగొట్టాడు. లవ్, ఎమోషనల్, సెంటిమెంట్, యాక్షన్ ఇలా అన్ని సమపాళ్లలో సినిమాలో ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఈ సినిమాను ప్రదీప్ తో చేయాలని గట్టిగా ఫిక్స్ అయిన కీర్తీశ్వరన్ అతను ఒప్పుకునే వరకు ట్రై చేశాడు. డ్యూడ్ ట్రైలర్ ఇంప్రెస్.. ఫైనల్ గా డ్యూడ్ ట్రైలర్ ఇంప్రెస్ చేసింది. అక్టోబర్ 17న రిలీజ్ అవుతున్న ఈ సినిమా యూత్ ఆడియన్స్ కి ఒక మంచి జోష్ ఇస్తుందని చెప్పొచ్చు. ప్రేమలు సినిమాతో సౌత్ ఆడియన్స్ కి బాగా దగ్గరైన మమితా ఈ డ్యూడ్ తో కూడా అదరగొట్టే ఛాన్స్ ఉన్నట్టే ఉంది. ఐతే సినిమాలో ఆమె రోల్ ని పెద్దగా చూపించలేదు. ప్రదీప్, మమితా ఇద్దరు తమ న్యాచురల్ యాక్టింగ్ తో ఆడియన్స్ ని ఆకట్టుకుంటారనిపిస్తుంది. ట్రైలర్ చూస్తే ప్రదీప్ మరో యూత్ ఫుల్ కంటెంట్ తో వస్తున్నాడని అనిపిస్తుంది. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ మ్యూజిక్ కూడా సూపర్ క్రేజ్ తీసుకు రానుంది. ఇప్పటికే సినిమా నుంచి రిలీజైన సాంగ్స్ ఆడియన్స్ కు బాగా నచ్చేశాయి.




# ప్రేమంటే నుంచి దోచావే పాట విడుదల

ప్రియదర్శి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ప్రేమంటే'. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆనంది హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుమ కనకాల కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'దోచావే నన్నే నువ్విలా..' అనే పాటను విడుదల చేశారు. ఈమెలోడీ పాటకు శ్రీమణి లిరిక్స్ అందించారు.